ప్రతిపక్షం

www.prathipaksham.in

గురువారం 15.01.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 296 పేజీలు:8 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

పాఠకులు, ప్రకటనకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులకు

సంక్రాంతి శుభాకాంక్షలు

'అక్షరయోగి' ఆశయాలను కొనసాగిస్తాం

'ప్రతిపక్షం' ప్రజల గొంతుక. 'ప్రతిపక్షం' ప్రజల ఆవేదనను, సమస్యలను, ఆకాంక్షలను ప్రభుత్వం దృష్టికి చేర్చే వారధి. 'ప్రతిపక్షం' అణగారిన వర్గాల కోసం పోరాడే ధిక్కార స్వరం. గత రెండు సంవత్సరాల క్రితం సీనియర్ జర్నలిస్టు మహమ్మద్ ఫజుల్ రహమాన్ సంపాదకత్వంలో ప్రారంభమైన 'ప్రతిపక్షం' తెలుగు దిన పత్రిక తెలంగాణ ప్రజలు మన్ననలు పొందుతూ వారి ఆకాంక్షలకు అనుగుణంగా వెలువడుతోంది. గత శుక్రవారం పత్రిక సంపాదకులు మహమ్మద్ ఫజుల్ రహమాన్ ఆకస్మికంగా ఈ లోకాన్ని విడిచి వెళ్లడం పత్రికకు తీరని లోటు. అయితే ఆయన ఆశయాలు, ఆలోచనలు అనుసరిస్తూ పత్రికను ముందుకు తీసుకెళతామని పత్రిక కుటుంబ సభ్యులమంతా సంకల్పించాం. నాలుగు దశాబ్దాలకు పైగా జర్నలిస్టుగా కొనసాగిన ఫజుల్ రహమాన్ జీవితం ఒక నిరంతర ప్రజా పోరాటం. ఫజుల్ రహమాన్ జర్నలిజాన్ని బాధ్యతగా స్వీకరించారు. ఉద్యోగంగా ఏనాడూ భావించలేదు. జర్నలిజాన్ని ప్రజల పక్షాన ప్రశ్నించే అస్త్రంగా ఆయన మలుచుకున్నారు. పాత్రికేయ వృత్తిని సమాజంలో జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించడం కోసమే వినియోగించారు. అధికార వ్యవస్థల లోపాలను వెలుగులోకి తెచ్చి మౌనంగా నలిగిపోతున్న ప్రజల వేదనను అక్షరాల రూపంలో బయటకు తీసుకురావడమే ఆయన జర్నలిజానికి మూల సూత్రంగా ఎంచుకున్నారు. అధికారానికి ఎదురు నిలువడం అంటే శబ్దం చేయడమే కాదు, కొన్నిసార్లు నిశ్శబ్దంగా నిజాన్ని నిలబెట్టడమే గొప్ప ధైర్యం. ఫజుల్ రహమాన్ ఆ ధైర్యానికి ప్రతిరూపం. భయానికి లొంగని కలం ఆయనది. ఒత్తిళ్లకు లొంగని మనస్తత్వం ఆయనది. ప్రభుత్వమేదైనా, అధికారమెవరిదైనా ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించినప్పుడు ప్రజల పక్షాన ప్రశ్నించకుండా ఆయన కలం ఆగలేదు. నాలుగు దశాబ్దాల జర్నలిస్టు ప్రయాణంలో ఆయన ఎన్నో మార్పులు చూశారు. పాలకులు మారారు, రాజకీయ రంగు మారింది, మీడియా స్వరూపం మారింది. కానీ ప్రజల పక్షాన నిలబడే ఆయన వైఖరి మాత్రం మారలేదు. అదే ఆయనను సాధారణ జర్నలిస్టు నుంచి "అక్షర యోగి"గా తీర్చిదిద్దింది. ప్రజల కన్నీళ్ల నుంచి ఆయన కథనాలు పుట్టాయి. రైతుల ఆకలి, కార్మికుల అణచివేత, పేదల హక్కుల రక్షణ ఇవన్నీ ఆయన వార్తా సేకరణకు కేంద్ర బిందువులు. బాధలను కేవలం నమోదు చేయలేదు, ఆ బాధకు కారణమైన వ్యవస్థను ప్రశ్నించారు. అలా ఆయన జర్నలిజం ఉద్యమంగా మారింది. ఫజుల్ రహమాన్ చూపిన దారి వ్యక్తిగత విజయానికి సంబంధించినది కాదు. అది ఒక తరం జర్నలిస్టులకు దిక్సూచి. "మీడియా అంటే అధికారానికి అనుకూలంగా నిలబడటం కాదు.. ప్రజల పక్షాన నిలబడటం" అనే సూత్రాన్ని ఆయన తన జీవితంలో ఆచరించడం ద్వారా ఇతర జర్నలిస్టులకు మార్గదర్శిగా నిలిచారు. సహచర జర్నలిస్టులకు బోధించారు. 'ప్రతిపక్షం' పత్రిక ఆయన కలల ఫలితం. చిన్న విత్తనంగా నాటిన ప్రయత్నం, ఈ రోజు ప్రజాస్వామ్యానికి నీడనిచ్చే వృక్షంగా ఎదిగింది. సత్యానికి ఆశ్రయంగా, ప్రజల హక్కుల ఆయుధంగా, అణచివేతకు ఎదురుగా నిలిచే బలమైన స్వరంగా 'ప్రతిపక్షం' నిలుస్తోంది. 'ప్రతిపక్షం' వేర్లు ప్రజల హృదయాల్లో నాటుకున్నాయి. ఫజుల్ రహమాన్ శరీరం మట్టిలో లీనమైనా, ఆయన ఆశయాలు కాలాన్ని దాటి ప్రయాణిస్తున్నాయి. ఆయన కలలు ముగిసిపోలేదు. అవి ఇంకా ప్రజల ఊపిరిలో జీవిస్తున్నాయి. ప్రతి ప్రశ్నలో, ప్రతి నిరసనలో, ప్రతి నిజమైన కథనంలో ఆయన ఆత్మ కొనసాగుతూనే ఉంటుంది. ప్రజల పక్షాన నిలబడి పోరాటాన్ని తన ప్రార్థనగా భావించిన ఫజుల్ రహమాన్ జర్నలిజం అంటే ఏమిటో చెప్పిన అక్షర యోధుడు. ఆయన చూపిన దారి ముగిసే వరకు కాదు, ప్రజల హక్కులు పూర్తిగా సాధించే వరకు 'ప్రతిపక్షం' నడుస్తూనే ఉంటుంది. ప్రజల పక్షాన పోరాడుతూ 'ప్రతిపక్షం' నిరాటంకంగా వెలువడుతుంది. అందుకు 'ప్రతిపక్షం' కుటుంబ సభ్యులుగా మేం కృషి చేస్తూనే ఉంటాం. ఆయన ఆశయాలను కొనసాగిస్తూనే ఉంటాం.

ప్రతిపక్షం

హైదరాబాద్

గురువారం
15.01.2026

- మహమ్మద్ అజీజ్ ఉర్ రహమాన్, పబ్లిషర్

మకర జ్యోతి దర్శనం

అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన శబరిమల

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

తిరువనంతపురం, జనవరి 14: శబరిమలకు వెళ్లిన అయ్యప్ప భక్తులకు మకర జ్యోతి దర్శనమిచ్చింది. పొన్నాంబలమేడు పర్వత శిఖరాల్లో జ్యోతి దర్శనమైంది. ఈ సందర్భంగా హరిహరక్షేత్రం శబరిమల 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. మకర సంక్రాంతి సందర్భంగా జ్యోతి దర్శనం కోసం భారీగా భక్తులు తరలివచ్చారు. ఆలయానికి ఈశాన్య దిశలో పర్వతశ్రేణుల నుంచి తళుక్కున మెరిసిన మకర జ్యోతిని దర్శించుకున్నారు. బుధవారం మకర సంక్రాంతి సందర్భంగా సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల మధ్య మకర జ్యోతి దర్శనమిచ్చింది. అయితే ఈ సారి మకరవిలక్కు ఉత్సవాలకు వస్తున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు కీలక నిర్ణయం

...:: మిగతా 2లో

సెలవు

సంక్రాంతి పండుగ సందర్భంగా నేడు 'ప్రతిపక్షం' కార్యాలయానికి సెలవు. కావున శుక్రవారం సంచిక వెలువడదు. శనివారం మళ్లీ కలుద్దాం.

మహిళా ఐఏఎస్‌పై అసభ్య కథనాలు..

ముగ్గురు జర్నలిస్టుల అరెస్టు

- ఓ ఛానల్ ఇన్‌పుట్ ఎడిటర్, ఇద్దరు రిపోర్టర్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 44 యూట్యూబ్ ఛానళ్లపై చర్యలకు రంగం సిద్ధం
- దూకుడు పెంచిన సీసీఎస్ పోలీసులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: ఓ మహిళా ఐఏఎస్ అధికారిను కించపరిచేలా వార్తలు ప్రసారం చేసిన కేసులో సీసీఎస్ పోలీసులు దూకుడు పెంచారు. తెలంగాణ ఐఏఎస్ అధికారుల సంఘం తరఫున సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్ రంజన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు డిజిటల్ మీడియా, యూట్యూబ్ ఛానల్స్‌పై కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఓ ఛానల్ ఇన్‌పుట్ ఎడిటర్‌తో పాటు ఇద్దరు రిపోర్టర్లను అరెస్ట్ చేశారు. కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్తుండగా ఇన్‌పుట్ ఎడిటర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అలాగే.. మహిళా ఐఏఎస్‌ను కించపరిచే విధంగా 44 యూట్యూబ్ ఛానల్స్ కథనాలు ప్రసారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో ఆయా యూట్యూబ్ ఛానళ్లపై చర్యలకు రంగం సిద్ధమైంది. ఛానల్స్ బాధ్యులను గుర్తించి అరెస్ట్

...:: మిగతా 2లో

జర్నలిస్టుల అరెస్టు అక్రమం

- ఎమర్జెన్సీని తలపిస్తున్న కాంగ్రెస్ పాలన
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: సంక్రాంతి పండుగవేళ పోలీసులు ముగ్గురు జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. తెలంగాణలో

...:: మిగతా 2లో

కక్ష సాధింపు సిగ్గుచేటు

- మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: పండుగ పూట, అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్టులపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం

...:: మిగతా 2లో



మా పెత్తనం ఉండాల్సిందే!

భద్రత పరంగా, నాటో శక్తిని మరింత బలోపేతం చేయాలంటే గ్రీన్‌ల్యాండ్ అమెరికా ఆధీనంలో ఉండాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. గ్రీన్‌లాండ్ దక్కించుకునే విషయంపై ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు.

9

విచారణ చేయడానికి ఏం లేదు!

ఐ ప్యాక్ పై ఈడీ దాడులకు సంబంధించి టీఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం కోల్ కత హైకోర్టు కొట్టివేసింది. ఈడీ ఇప్పటికే దాదాపు ఇదే అంశాలపై సుప్రీంకోర్టులో రెండు ప్రత్యేక పిటిషన్లు దాఖలు చేసినందున, మళ్లీ విచారణ చేపట్టడం సరికాదని కోర్టు అభిప్రాయపడింది.

9

వ్యక్తిత్వ హననం చేస్తే కఠిన చర్యలు

- డీజీపీ శివధర్ రెడ్డి ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: హైదరాబాద్: సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న వ్యక్తిత్వ హననం పై డీజీపీ శివధర్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు గతంలోనే తమ విధానాన్ని వెల్లడించినట్లు గుర్తు చేశారు. డీజీపీగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో.. సోషల్ మీడియా వినియోగంపై మార్గనిర్దేశం చేస్తూ, చట్ట పరిమితులను దాటి వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశానని పేర్కొన్నారు. సోషల్ మీడియా పేరుతో ఎవరైనా వ్యక్తిత్వ హననం చేయడం, ఇతరుల శీలానికి భంగం కలిగించడం, క్యారెక్టర్ అసాసినేషన్కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడితే తప్పకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తమ విధానంగా తెలియజేశానన్నారు. అలాగే ఇతర వ్యక్తుల గురించి, వారి కుటుంబ సభ్యుల గురించి తప్పుడు వార్తలు ప్రచారం చేయడం, అసత్య ఆరోపణలు చేయడం, ఫేక్ న్యూస్ను సర్క్యులేట్ చేసి వ్యక్తిగత జీవితాల్లో జోక్యం చేసుకోవడం అనుమతించబోమని మరో మారుస్పష్టం

...:: మిగతా 2లో

పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి..

- మీడియా ప్రతినిధులు విచారణకు సహకరించాలి
- పిలిస్తే ఎవరైనా విచారణకు రావాలి
- ఆధారాలు లేకుండా వ్యక్తిగత విమర్శలు క్రూరత్వమే
- హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: మహిళా ఐఏఎస్ అధికారిణిపై వ్యక్తిగత విమర్శలు చేసిన వ్యవహారంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హైదరాబాద్ సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ కేసులో ఓ మీడియా సంస్థ ప్రతినిధుల అరెస్టుపై సజ్జనార్ స్పందించారు. మీడియా ప్రతినిధులు అప్పటికప్పుడు ఫ్లైట్ టికెట్లు బుక్ చేసుకుని బ్యాంకాక్ పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మరో రిపోర్టర్ విచారణకు వస్తానని చెప్పి సెల్ ఫోన్ స్విచ్చాఫ్ చేసుకున్నారని అందుకే వారిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నామని

...:: మిగతా 2లో

రాష్ట్రంలో మున్సిపల్ హీట్

- పట్టణాలపై పార్టీల స్పెషల్ ఫోకస్
- అభ్యర్థుల ఖరారులో పడిన పార్టీలు
- ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసిన అధికారపార్టీ
- ఎన్నికలకు అన్నీ పార్టీల కన్నా ముందున్న కాంగ్రెస్
- జిల్లా స్థాయి సమావేశాలతో బీఆర్ఎస్‌బిజీ
- నేడో రేపో రిజర్వేషన్లు ఖరారు?

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: రాష్ట్రంలో రాజకీయ వేడి పట్టణాలకు చేరింది. నిన్నటిదాకా పల్లె పల్స్ పట్టుకోవడంలో పోటీ పడ్డ ప్రధాన పార్టీలు, ఇప్పుడు పట్టణ ఓటరును మచ్చిక చేసుకునే పనిలో పడ్డాయి. పంచాయతీ ఎన్నికల ముగిసిన వెంటనే మున్సిపల్ వార్ కోసం అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ తమ అస్త్రశస్త్రాలను సిద్ధం చేస్తున్నాయి. షెడ్యూల్ రాకముందే బస్తీ మే సవాల్ అంటున్నాయి. మొన్నటిదాకా గ్రామీణ ఓటరు పల్స్ పట్టుకోవడంతో తెగ పోటీపడి, పంచాయతీ ఎన్నికల్ని రంజుగా పార్టీలు మార్చేశాయి. ఇక ఇప్పుడు పట్టణ ఓటరు వంతు. బస్తీ ఓటరును ఫిదా చేయడమెలా? మరో నెలరోజుల్లో వచ్చే మున్సిపల్ వార్‌లో నెగ్గడం

...:: మిగతా 2లో

అరెస్టయిన జర్నలిస్టులకు బెయిల్

పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించిన మెజిస్ట్రేట్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 14: ఐఏఎస్ అధికారిణిపై అనుచిత కథకం కేసులో అరెస్టయిన ముగ్గురు జర్నలిస్టులకు 14వ మెజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అరెస్టయిన జర్నలిస్టులను హైదరాబాద్ పోలీసులు ఇన్‌చార్జ్ 14వ ఏసీఎంఎం మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారు. వీరిలో సీనియర్ జర్నలిస్టులు దొంతు రమేష్, సుధీర్‌లను బషీర్ బాగ్ సీసీఎస్ నుంచి మణికొండలోని మెజిస్ట్రేట్ వద్దకు తరలించి హాజరుపరిచారు. కేసుకు సంబంధించిన వాదనలు విన్న మెజిస్ట్రేట్ రిమాండ్ విధించాలన్న పోలీసుల అభ్యర్థనను తిరస్కరించారు.

వెంటనే ఇరాన్ విడిచి వచ్చేయండి

ఇరాన్‌లో చెలరేగిన అల్లర్లు తీవ్రరూపం దాల్చడంతో భారత్ అప్రమత్తమైంది. ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయులు వెంటనే ఆ దేశాన్ని విడిచి తిరిగి స్వదేశానికి రావాలని ఆదేశించింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ అత్యవసర అడ్వైజరీ జారీ చేసింది.

9

మకర జ్యోతి దర్శనం

మొదటిపేజీ తరువాయి

తీసుకున్నారు. కేరళ హైకోర్టు ఆదేశాలతో దర్శన కోటాపై ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దాంతో పోలీసులు పక్కాగా భద్రతా ఏర్పాట్లు చేశారు. ఈ మకర దర్శనం కోసం సన్నిధానం, పంబ, శబరిమల కొండ, నీలిమల ప్రాంతాలు అయ్యప్ప స్వాములతో కిక్కిరిసిపోయాయి. దాంతో బుధవారం ఉదయం 10.00 గంటల తర్వాత పంబ నుంచి సన్నిధానానికి భక్తులను అనుమతించ లేదని సమాచారం. పంచగిరులు.. నీలిమల, కరిమల, శబరిమల, అప్పాచిమేడు, అలుదామేడు ప్రాంతాల్లో ఈ దివ్య జ్యోతి దర్శనం స్పష్టంగా కనిపించింది. దాంతో ఆయా ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయాయి. శబరిమలలో సంక్రాంతి పండగ వేళ.. పంచగిరులపై మకరవిలక్కు (మకర జ్యోతి)గా అయ్యప్ప స్వామి వారు దర్శనమిస్తారని భక్తులు ప్రగాఢ విశ్వాసం. గత కొన్ని శతాబ్దాలుగా ఈ ఆచారం కొనసాగుతోంది. దాంతో లక్షలాది మంది భక్తులు శబరిమలకు మకర సంక్రాంతి వేళ తరలివస్తారు. మరోవైపు ఈ రోజు అంటే బుధవారం మధ్యాహ్నం 3.13 గంటల నుంచి మకర సంక్రాంతి పుణ్యకాలం ప్రారంభమైంది. దీంతో స్వామివారికి మేల్ శాంతుల పేరిట తంత్రిలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. జనవరి 12న పందళం రాజప్రసాదం నుంచి బయలుదేరిన స్వామి వారి ఆభరణాలు ఈ రోజు సాయంత్రం 5.20 గంటలకు స్వామివారి సన్నిధికి చేరుకున్నాయి. వాటిని స్వామివారికి అలంకరించి.. మహదీపారాధన నిర్వహించారు. ఈ దీపారాధన అనంతరం పొన్నంబలమేడు కొండపై మకరజ్యోతి మూడుసార్లు దర్శనమిచ్చింది. అంటే సాయంత్రం 6.30 గంటల నుంచి 6.45 గంటల వరకు అంటే పావుగంట మధ్య మూడుసార్లు స్వామివారు దీప రూపంలో దర్శనమిచ్చారు. జనవరి 19వ తేదీ వరకు స్వామివారి దర్శనం కొనసాగనుంది. ఆ మరునాడు అంటే జనవరి 20వ తేదీ ఆలయాన్ని మూసివేయనున్నారు.

ముగ్గురు జర్నలిస్టుల అరెస్టు

మొదటిపేజీ తరువాయి

చేసేందుకు సీసీఎస్ పోలీసుల సమాయత్తమవుతున్నారు. ఇప్పటికే పలువురిని పోలీసులు గుర్తించారు. ఈ కేసులో పోలీసుల దూకుడుతో పలువురు యూట్యూబ్ ఛానల్స్ నిర్వాహకులు అజ్ఞాతంలో ఉన్నట్లు సమాచారం. కాగా.. సీఎం ఫొటో మార్ఫింగ్, మహిళా ఐఏఎస్‌పై అసభ్యకర కథనాలపై తెలంగాణ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదేశాల మేరకు 8 మంది సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేశారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ పర్యవేక్షణలో ఈ బృందం పనిచేస్తోంది. దర్యాప్తు వేగంగా పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. మరోవైపు మహిళా అధికారిపై అసభ్యకర కథనాలను మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సీతక్క తీవ్రంగా ఖండించారు. అలాగే ఐఏఎస్, ఐపీఎస్ అసోసియేషన్లు కూడా ఈ వ్యవహారంపై సీరియస్ అయ్యాయి. ఇలాంటి వార్తలు అధికారుల మనోభావాలను దెబ్బతీస్తాయని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

పారిపోయేందుకు ప్రయత్నిస్తేనే అదుపులోకి..

మొదటిపేజీ తరువాయి

చెప్పారు. మీడియా ప్రతినిధులు సిట్ విచారణకు సహకరించాలని, పిలిస్తే ఎవరైనా విచారణకు రావాలని, విచారణను ఎదుర్కోకుండా ఎందుకు పారిపోతున్నారని ప్రశ్నించారు.

అంతా చట్ట ప్రకారమే చేస్తాం

త్వరలోనే అన్ని వివరాలు వెల్లడిస్తామని, అంతా చట్ట ప్రకారమే చేస్తామని సజ్జనార్ వెల్లడించారు. చట్టం తనపని తాను చేసుకుపోతుందని, ప్రజా జీవితంలో విమర్శలు సహజమని, విమర్శలు కూడా సహేతుకంగా ఉండాలన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా మహిళా అధికారిణిపై వ్యక్తిగత విమర్శలు చేయడంల క్రూరత్వమే అవుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారని, అలాంటి వారిపై అసత్య కథనాలు ప్రసారమైతే వాళ్లు సమాజంలో ఎలా పనిచేయగలుగుతారని అన్నారు. మహిళా అధికారులను కించపరుస్తూ వార్తలు ఎలా రాస్తారని మండిపడ్డారు. అందరూ ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. సీఎంపై అవమానకర వార్తలు వేయడంతో మరో కేసు నారాయణపేట్ జిల్లాలో నమోదైందని, ఈ రెండు కేసులకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ జరుపుతోందని ఆయన తెలిపారు. మహిళా అధికారిణులపై ఉద్దేశపూర్వకంగా దాడులు ఆందోళనకరమని హైదరాబాద్ సీపీ సజ్జనార్ అన్నారు. ప్రజా జీవితంలో మహిళలను అవమానించడం క్రూరత్వమేనని, మహిళా ఉద్యోగులపై వ్యక్తిగత దాడులు ఆమోదయోగ్యం కాదని చెప్పారు. వ్యక్తిత్వంపై దాడి అంటే వారి పురోగతిపై దాడి చేసినట్టే అవుతుందని, స్త్రీలను గౌరవించని సమాజం భవిష్యత్తు దెబ్బతింటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తు అంతా మహిళలదే అని సజ్జనార్ పేర్కొన్నారు. ప్రస్తుతం మీడియా ప్రతినిధులను వైద్యపరీక్షల కోసం కింగ్ కోఠిలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు.

జర్నలిస్టుల అరెస్టు అక్రమం

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ పాలన అనుక్షణం ఎమర్జెన్సీని గుర్తుచేస్తోందని ఆయన విమర్శించారు. తెలంగాణ డీజీపీ జర్నలిస్టులను నేరస్తులలా ట్రీట్ చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన తన అధికారిక ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. ముందుగా వారికి నోటీసులు జారీచేసి విచారణకు పిలువాల్సిందని కేటీఆర్ అన్నారు. రాత్రిపూట జర్నలిస్టుల ఇళ్లపై దాడిచేసి సబబు కాదని తప్పుపట్టారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణమే విడుదల చేయాలని తాను డిమాండ్ చేస్తున్నానన్నారు. వారిపై ఏమీ నాన్‌బెయిలబుల్ సెక్షన్‌ల కింద కేసులు నమోదు కాలేదని, అలాంటప్పుడు తెలంగాణ పోలీసులు జర్నలిస్టులను, వారి కుటుంబాలను ఎందుకు అర్ధరాత్రి అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశ్నించారు. జర్నలిస్టులను వెంటనే విడుదల చేసి వారి విషయంలో చట్టపరంగా నడుచుకోవాలని డీజీపీని కోరుతున్నానని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, ఆ పార్టీకి నీచ నాయకత్వానికి అనుగుణంగా మురికి రాజకీయాలు చేయవద్దని ఆయన సూచించారు.

వ్యక్తిత్వ హననం చేస్తే కఠిన చర్యలు

మొదటిపేజీ తరువాయి

చేశారు. చట్టానికి లోబడి, నిర్మాణాత్మక విమర్శలు, అభిప్రాయాలు వ్యక్తం చేసుకోవడంపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదని డీజీపీ అన్నారు. అయితే ఆ పరిమితులను దాటి, సామాజిక మాధ్యమాలను దుర్వినియోగం చేస్తూ అబద్ధాలు ప్రచారం చేస్తే మాత్రం సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కక్ష సాధింపు సిగ్గుచేటు

మొదటిపేజీ తరువాయి

చేశారు. పండగ పూట జర్నలిస్టులపై కక్ష్య సాధింపు చర్యలకు దిగటం సిగ్గుచేటన్నారు. మీ రాజకీయ వికృత క్రీడల్లో తెలంగాణ ఉద్యమకారులైన జర్నలిస్టులను బలి చేస్తారా?.. అంటూ మండిపడ్డారు. ఇళ్లల్లో చొరబడి అర్ధరాత్రి వేళ అరెస్టులు చేయడానికి వాళ్లేమైన తీవ్రవాదులా?.. అంటూ ప్రశ్నించారు. జర్నలిస్టుల వరుస అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాడిగా అభివర్ణించారు. తెలంగాణ జర్నలిస్టుల ఆత్మగౌరవం పై పని గట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రత్యక్ష దాడిగా చెప్పారు. జర్నలిస్టుల అరెస్టులు, మీడియా డిజిటల్ మీడియా పై సిట్ లలో ఎవర్ని కాపాడుతున్నారు? ఎవరిని వేటాడుతున్నారన్నారు. మీ స్వార్థ రాజకీయాల కోసం ప్రజాస్వామ్య హననానికి పాల్పడటం దుర్మార్గమని హరీష్ రావు దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి.. ఇదేనా నీ ప్రజాపాలన? .. ఇదేనా మీరు చెప్పిన ప్రజాస్వామ్య పునరుద్ధరణ?.. అంటూ హరీష్ రావు తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

రాష్ట్రంలో మున్సిపల్ హీట్

మొదటిపేజీ తరువాయి

ఎలా? అనే ఆలోచనతో పార్టీలు దూకుడు పెంచాయి. ఈ మేరకు నేతల నుంచి డైనమైట్లు లాంటి డైలాగులు పేలుతున్నాయి.

ఫిబ్రవరి మొదటి వారంలో

ఫిబ్రవరిలోనే మున్సిపల్ జరిగే అవకాశం ఉంది. స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఏ క్షణంలోనైనా షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది. రాజకీయ పార్టీలు కూడా బస్తీ మే సవాల్ అంటున్నాయి. ఈ నెల 16 నుంచి మున్సిపాలిటీల్లో సీఎం రేవంత్ ప్రచారానికి సిద్ధమయ్యారు. అపోజిషన్ పార్టీ బీఆర్ఎస్ అంతకుముందే మేలుకుంది. జిల్లా స్థాయి సమావేశాలతో లీడర్లను కేటీఆర్ అప్రమత్తం చేస్తున్నారు. ఎమ్మెల్యేలు, సీనియర్ లీడర్లు, పార్టీ జిల్లా ప్రెసిడెంట్లతో వరుసగా భేటీ అవుతూ వాళ్లలో భరోసా నింపుతున్నారు. 4 వేలకు పైగా గ్రామపంచాయతీల్లో గెలిచాం, రెండేళ్లలో ప్రభుత్వంపై వ్యతిరేకత ఏ స్థాయిలో పెరిగిందో దీన్ని బట్టే అర్థమౌతోందంటూ క్యాడర్‌కి గులాబీ పార్టీ అధిష్ఠానం బూస్ట్ ఇస్తోంది. రూలింగ్ పార్టీ కూడా జూబ్లీహిల్స్ ఇచ్చిన జోష్‌తో రంగంలోకి దిగింది. క్వార్టర్ ఫైనల్స్ కొట్టాం, రేపటిరోజున సెమీఫైనల్స్ కూడా కొట్టబోతున్నాం.. ఫైనల్స్‌లో కూడా మాదే విక్టరీ అంటోంది . పంచాయతీ ఎన్నికల్లో కంటే మున్సిపల్ పోరులో ఎక్కువ సత్తా చూపుతామన్న ధీమాతో రేవంత్ సర్కార్ ఉంది. పంచాయతీ ఎన్నికల్లో అంతో ఇంతో ఉనికిని చాటుకున్న కమలం పార్టీ.. పట్టణ ఓటుపై ఫోకస్ పెంచింది. ఓటర్ల జాబితా విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాలను సైతం ఎంపిక చేసింది. మున్సిపాలిటీల్లోని 2వేల 996 వార్డుల్లో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయింది. మొత్తం 117 మున్సిపాలిటీలు.. 6 కార్పొరేషన్లు, 52 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. అటు మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్లపై కూడా తెలంగాణ సర్కార్ కసరత్తు షురూ చేసింది. వార్డులు, చైర్‌పర్సన్ స్థానాలకు మున్సిపల్ శాఖ నేడో రేపో రిజర్వేషన్లు ఖరారు చేసి, ఈసీకి పంపనుంది.

ఇందిరమ్మ చీరలను ధరించి వరి నాట్లు

తెలంగాణ ప్రభుత్వం సంక్రాంతి కానుకగా అందజేసిన ఇందిరమ్మ చీరలను ధరించి నర్వ మండల పరిధిలోని రాయికోడ్ లో పొలం పనుల్లో భాగంగా మహిళలు వరి నాట్లు వేసుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటేనే మహిళల రాజ్యమని, తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతిపక్షం ప్రతినిధి, నారాయణపేట్

ములుగు జిల్లా జగ్గన్నపేట గ్రామంలో మంత్రి సీతక్క సంక్రాంతి పండుగ సందర్భంగా తన కుటుంబ సభ్యులను కలుసుకున్నారు.. ఇంటిముందు అరుగుపై కూర్చొని తల్లిదండ్రులతో కొంత కాలక్షేపంగా మాట్లాడుతూ.. వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

ప్రతిపక్షం, ములుగు

కామారెడ్డిలో దారుణం.. 600 వీధి కుక్కల మృతి

ప్రతిపక్షం, కామారెడ్డి , జనవరి 14: మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలను చంపిన ఘటన కలకలం రేపింది. పాల్వంచ మండల కేంద్రంతో పాటు ఫరీద్ పేట్, బండరామేశ్వర్ పల్లి, భవాని పేట్, వాడి గ్రామాల్లో సుమారు 600కు పైగా కుక్కలను హతమార్చారు. మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు గ్రామాలలో గ్రామ సర్పంచ్‌లు.. సుమారు 600 కుక్కలను చంపి పూడ్చేశారు. పాల్వంచ, ఫరీద్ పేట, బండరామేశ్వర్ పల్లి, భవాని పేట్, వాడి గ్రామ పంచాయతీ పరిధిల్లో ఉండే వీధి శునకాలకు విష ఇంజక్షన్లు, గుళికలు పెట్టి హతమార్చినట్టుగా జంతు ప్రేమికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో.. పాతిపెట్టిన శునకాల మృతదేహాలను జేసీబీ సాయంతో వెలికితీసి.. వెటర్నరీ డాక్టర్ల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కల మృతిపై స్త్రే అనిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా మేనేజర్ మాట్లాడుతూ.. తమకు తెలిసిన సమాచారం మేరకు ఆయా గ్రామాలలో పర్యటించి సుమారు 5 ఊర్లలో 600 కుక్కలను విష ఇంజక్షన్లు, గుళికలతో చంపివేసి గ్రామ శివారులో పాతిపెట్టినట్లుగా ఆనవాళ్లు లభించినట్లు తెలిపారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో కుక్కలను గ్రామాల నుంచి తరిమేస్తామంటూ కొందరు సర్పంచ్‌లు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుకునేందుకు ఇలా మూగజీవులను చంపడం ఎంతవరకు సమంజసమని జంతు ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేశారు. కుక్కలకు రేబిస్ వ్యాధి రాకుండా ముందస్తుగా ఇంజక్షన్ ఇవ్వాలని సూచించారు. జంతువుల పట్ల ప్రేమగా ఉండాలి తప్ప.. వాటిని హతమార్చడం ఎంతవరకు సమంజసమని అనిమల్ లవర్స్ ప్రశ్నించారు. అనంతరం.. ఈ విషయమై స్థానిక మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో సంబంధిత సర్పంచ్‌లపై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులైన సెక్రెటరీలు కలిసే శునకాలను చంపివేసినట్లుగా ప్రాథమికంగా నిర్ధారించినట్లు పేర్కొన్నారు. మాచారెడ్డి ఎస్ఐ అనిల్ స్పందిస్తూ.. సదరు ఐదు గ్రామాల సర్పంచులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రాణం తీసిన చైనా మాంజా

- చైనా మంజా మెడకు కోసుకుపోయిన
- ద్విచక్రవాహనదారుడు మృతి
- మృతుడు బీహార్ కు చెందిన వలస కార్మికుడు అద్వైక్

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 14 : చైనా మాంజా దారాలు కోసుకుపోతూ.. జనాల ప్రాణాలమీదకు వస్తున్నాయి. కొన్నిరోజులుగా వాహనదారుల పీకల మీదకు వస్తున్నాయి చైనా మాంజా దారాలు. పోలీస్ లు ప్రజలకు అవగాహన కల్పించి, మాంజ దారం అమ్మే వారిపై కేసులు నమోదు చేసిన ఎలాంటి ఫలితం లేకపోయింది. తాజాగా ఓ ద్విచక్ర వాహనం పై వెళ్తున్న వ్యక్తి ని బలి తీసుకుంది. సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాదిలో చైనా మాంజా చుట్టుకుని ఓ వలస కార్మికుడు మరణించాడు.. బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి చైనా మాంజా చుట్టుకుని గొంతు కోసుకుపోయింది. తాజాగా ఈ ఘటన అందరిని కలిచి వేసింది. చైనా మంజా మెడకు కోసుకుపోయిన ద్విచక్రవాహనదారుడు . మృతుడు బీహార్ కు చెందిన అద్వైక్ గా గుర్తించారు పోలీసులు. మృతుడు గత కొద్ది రోజులుగా వలస కార్మికునిగా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈ రోజు బైక్ పై సంగారెడ్డి వైపు వస్తుండగా తెగిన గాలిపటం మాంజా దారం అతని గొంతు వద్ద కోసుకుపోయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మార్చురికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలపై ఇది ప్రత్యక్ష దాడి. అర్ధరాత్రి ఇళ్లలోకి చొరబడి, నోటీసులు ఇవ్వకుండా జర్నలిస్టులను అరెస్టు చేయడం శోచనీయం. జర్నలిస్టులు ఉగ్రవాదులు కాదు. ఇలాంటి చర్యలు మీడియాలో భయాన్ని సృష్టిస్తాయి. ప్రభుత్వం రాజ్యాంగాన్ని గౌరవించాలి. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలి.

- వైసీపీ అధినేత జగన్

రాజకీయం

'మేడారం' మహా జాతరకు భారీ ఏర్పాట్లు

- 8 పరిపాలనా జోన్లు, 42 సెక్టర్లు
- క్షేత్ర స్థాయిలో మంత్రి సీతక్క సమీక్ష

ప్రతిపక్షం ప్రతినిధి, మేడారం, జనవరి 14: మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర-2026కు తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. కోట్లాది భక్తులు తల్లుల దర్శనానికి వచ్చే ఈ మహా పర్వంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకుంటోంది. ఈ ఏర్పాట్లన్నిటిపై నిత్యం ప్రత్యక్ష పర్యవేక్షణ చేయడానికి మంత్రి సీతక్క మేడారంలోనే బస చేస్తూ, క్షేత్రస్థాయిలో ప్రతి అంశాన్ని పరిశీలిస్తున్నారు. ఈ సారి సుమారు మూడు కోట్ల మంది భక్తులు వస్తారనే అంచనాతో, ఎక్కడా ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు కలిసి సమగ్ర ప్రణాళికతో పని చేసేలా మంత్రి సీతక్క నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ జాతర కోసం మొత్తం 21 శాఖలకు చెందిన 42,027 మంది అధికారులు, సిబ్బంది మేడారం, పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహించనున్నారు. వీరికి అదనంగా 2 వేల మంది ఆదివాసీ యువత వాలంటీర్లుగా తమ సేవలు అందించనున్నారు. మొబైల్ నెట్ వర్క్ కి ఎలాంటి అంతరాయం కలగకుండా 27 శాశ్వత టవర్లతో పాటు తాత్కాలిక పద్ధతిలో 33 మొబైల్ టవర్లను, 450 వెరీ హై ఫ్రీక్వెన్సీ సెట్లను ఏర్పాటు చేశారు. భక్తుల రద్దీని క్రమబద్ధంగా నియంత్రించేందుకు మేడారం ప్రాంతాన్ని 8 పరిపాలనా జోన్లుగా, 42 సెక్టర్లుగా విభజించారు. ఒక్కో జోన్ కు జిల్లా స్థాయి అధికారి ఇంచార్జ్ గా వ్యవహరిస్తారు. ఒక్కో సెక్టార్ కు మండల స్థాయి అధికారి బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఆలయ ప్రాంగణం, గద్దెలు, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్, ఊరట్టం, శివరాం సాగర్, నర్లాపూర్, పడిగాపూర్ వంటి అన్ని కీలక ప్రాంతాల్లో కంట్రోల్ రూములు, మిస్సింగ్ పర్సన్స్ క్యాంపులు, అత్యవసర స్పందన బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రాకపోకల్లో ఇబ్బందులు రాకుండా మొత్తం 525 చోట్ల రహదారి సమస్యలను గుర్తించి పరిష్కరించారు. జాతరకు ఉపయోగపడే కొత్త రోడ్లు, మరమ్మత్తులు, కల్వర్టులతో రవాణా వ్యవస్థను బలోపేతం చేశారు. వాహనాల రద్దీ తగ్గించేందుకు అటవీ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో మొత్తం 1,418 ఎకరాల విస్తీర్ణంలో 42 పార్కింగ్ ప్రాంతాలు సిద్ధం చేశారు. తాగునీటి సమస్య తలెత్తకుండా మిషన్ భగీరథ ద్వారా నిరంతం తాగు నీటి సరఫరా జరిగేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 5,482 తాగు నీటి నల్లాలు ఏర్పాటు చేసి భక్తులకు శుద్ధమైన నీటిని అందిస్తున్నారు. జంపన్నవాగులో పవిత్ర స్నానాలు చేసే భక్తుల కోస 119 డ్రెస్సింగ్ రూములు ఏర్పాటు చేయడంతో పాటు నీటి పరిశుభ్రత కోసం ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయనున్నారు. 285 బ్లాకుల్లో 5700 టాయిలెట్లను సిద్ధం చేశారు. వీటికి అధనంగా మొబైల్ టాయిలెట్స్ ను అందుబాటులోకి తేనున్నారు. పారిశుధ్య నిర్వహణ కోసం 5 వేల మంది సిబ్బందిని, 150 ట్యాంకర్లు, 100 ట్రాక్టర్లు, 18 స్వీపింగ్ మిషిన్లు, 12 జేసీబీ, 40 స్వచ్ఛ ఆటోలు, 16 డోజర్లను రంగంలోకి దింపారు. జాతర ప్రాంతంలో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా టీజీఎన్పీడీసీఎల్ ద్వారా 196 ట్రాన్స్‌ఫార్మర్లు, 911 విద్యుత్ స్తంభాలు, 65.75 కిలోమీటర్ల విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు. విద్యుత్ అంతరాయం తలెత్తకుండా 350 మంది సిబ్బందిని నియమించారు. భక్తులు సులభంగా మేడారానికి చేరుకునేందుకు టీజీఆర్టీసీ ఈసారి 4,000 బస్సులను వినియోగంలోకి తెచ్చి 51,000 ట్రిప్పులు నిర్వహిస్తోంది. ప్రత్యేక బస్టాండ్లు, ప్రత్యేక రూట్లతో రవాణా వ్యవస్థను మరింత సమర్థంగా నిర్వహిస్తున్నారు. జాతర కోసం 10441 మంది ఆర్టీసీ సిబ్బంది సేవలందించనున్నారు. గంటకు 15 బస్సులు ప్రయాణించేలా ప్లాన్ చేస్తున్నారు. జాతర సమయంలో ఆరోగ్య సేవల కోసం మొత్తం 5,192 మంది వైద్య సిబ్బందిని నియమించారు. భక్తులకు సేవలందించేందుకు 30 అంబులెన్సులు, 40 బైక్ అంబులెన్సులు, 50 పడకల ప్రధాన ఆసుపత్రి, రోజుకు 30 మెడికల్ క్యాంపులు పనిచేస్తాయి. జంపన్నవాగులో ప్రమాదాలను నివారించేందుకు 210 మంది గజ ఈతగాళ్లు, 12 మంది సింగరేణి రెస్క్యూ సిబ్బంది, 100 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నారు. అగ్నిప్రమాదాలను ఎదుర్కొనేందుకు 15 ఫైర్ బ్రిగేడ్ వాహనాలు, 268 మంది ఫైర్ ఫైటర్లు సిద్ధంగా ఉంచారు. అటవీ శాఖ ద్వారా పార్కింగ్, రోడ్లతో పాటు పర్యావరణ సంరక్షణ చేపడుతుండగా, ఐటిడీఏ ఆధ్వర్యంలో గిరిజనులకు కొబ్బరి కాయ, బెల్లం, ఇతర వ్యాపారాల కోసం లైసెన్సులు ఇచ్చి ఉపాధి కల్పిస్తున్నారు. మొత్తంగా మేడారం మహాజాతర-2026ను ప్రపంచ స్థాయిలో నిర్వహించాలనే లక్ష్యంతో, అన్ని శాఖల సమన్వయంతో భక్తులకు త్వరితగతిన తల్లుల దర్శనం, సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోంది.

తెలంగాణ పంచాయతీలకు కేంద్ర నిధులు

- తొలి విడతగా రూ.260 కోట్లు
- కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 14 : తెలంగాణలోని గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థల బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని, గ్రామీణ స్థాయిలో ప్రజాస్వామ్య వ్యవస్థలను మరింత బలపరిచే లక్ష్యంతో నిధులను విడుదల చేయనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. గత పదేళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం రూ.11 వేల కోట్లకు పైగా నిధులు విడుదల చేసిందని తెలిపారు. 2015-16 నుంచి 2019-20 మధ్యకాలంలో రూ.5,060 కోట్లను మంజూరు చేయగా, 2020-21 నుంచి 2025-26 కాలానికి నిధులను 80 శాతం పెంచి రూ.9,050 కోట్లకు కేటాయించారన్నారు. ఇందులో ఇప్పటికే రూ.6,051 కోట్లను విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు. గ్రామీణ స్థాయిలో ప్రజాప్రతినిధ్య సంస్థలు బలంగా ఉంటే పాలనలో బాధ్యత, పారదర్శకత పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం గట్టిగా విశ్వసిస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. అందుకే స్థానిక సంస్థలకు నిధులను సకాలంలో విడుదల చేస్తోందన్నారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తవడం, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వినియోగ ధృవీకరణ పత్రాలు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల సమర్పించడంతో, 2024-25 సంవత్సరానికి సంబంధించిన తొలి విడతగా రూ.260 కోట్లను త్వరలోనే కేంద్ర ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని యూసీలు సమర్పించిన వెంటనే మిగిలిన సుమారు రూ.2,500 కోట్లను దశలవారీగా విడుదల చేస్తామని స్పష్టం చేశారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేక బ్యాంక్ ఖాతా ఉండాలని, ఆ ఖాతా పీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో యూనిక్ ఏజెన్సీ కోడ్‌తో నమోదు అయి ఉండాలని మంత్రి గుర్తు చేశారు. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీల బ్యాంక్ ఖాతాలను అటాచ్ చేసి, ఆ నిధులను ఇతర అవసరాలకు మళ్లించిందని ఆయన ఆరోపించారు. దీని వల్ల తమ పదవీకాలంలో చేసిన పనులకు డబ్బులు రాక పలువురు సర్పంచులు రాజీనామాలు చేయాల్సి వచ్చిందన్నారు. కొన్ని దురదృష్టకర ఘటనల్లో సర్పంచులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని పేర్కొంటూ, ఇది అత్యంత విచారకరమని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామీణ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కిషన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధితో పాటు 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని ఆయన కోరారు.

తెలుగుదనాన్ని ఆవిష్కరించే సంక్రాంతి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ప్రతిపక్షం, షాద్ నగర్, జనవరి 14 : అచ్చమైన తెలుగుదనాన్ని ఆవిష్కరించే అందమైన పండుగ సంక్రాంతి అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా బసవన్న ఆశీస్సులు పొందిన ఆయన అనంతరం మాట్లాడుతూ నేతలు, కార్యకర్తలు, నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారుల నుంచి పెద్దవారి వరకు అందరికీ ఆనందాలు పంచే ఈ సంక్రాంతి పండుగను ప్రతి ఒక్కరు సంతోషంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నేతలు కార్యకర్తలు ఆయనకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ బసవన్న పై వస్త్రాలు కప్పి పండుగ సాయన్నలకు కానుకలు అందించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కూడా బసవన్న ఆశీస్సులను అందుకున్నారు.

పైసల కోసమే కేసీఆర్ కుటుంబం పంచాయితీ

- మంత్రి వివేక్ వెంకటస్వామి

ప్రతిపక్షం, మందమర్రి, జనవరి 14 : రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కుంభకోణాలతో కూడబెట్టుకున్న పైసల కోసం ఆ కుటుంబంలో ఆ పంచాయితీ మొదలైందని, ఆయన కూతురు, మాజీ ఎమ్మెల్సీ కవిత ఆరోపణలకు సమాధానం ఎందుకు చెప్పలేక తప్పించుకుంటున్నారని రాష్ట్ర కార్మిక, ఉపాధికల్పన, గనులశాఖ మం త్రి డాక్టర్ జి వివేక్‌వెంకటస్వామి ప్రశ్నించారు. పట్టణంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొదటి నుంచి తాను కేసీఆర్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతి పైన ఆరోపణలు చేశానని అవే ప్రస్తుతం నిజమయ్యాయని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్షకోట్ల కుంభకోణం జరిగిందని కేసీఆర్ కుంటుంబంపై వ్యతిరేకంగా మొదటి నుంచి పోరాడిన వ్యక్తిని తానేనని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ గురించి తాము ఏమి చెప్పనక్కర్లేదని మాజీ ఎమ్మెల్సీ కవితే వారి భరతం పడుతోందని అన్నారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగిన తమ పార్టీదే విజయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల సౌకర్యార్థం కొత్త బస్సు ఏర్పాటు

మందమర్రి పట్టణ ప్రజల ప్రయాణ సౌకర్యార్థం కొత్త బస్సు ఏర్పాటు చేశామని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనులశాఖ మంత్రి డాక్టర్ జి వివేక్‌వెంకటస్వామి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన కొత్త బస్సును కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన బస్సులో కొంతదూరం ప్రయాణించారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు, తహసీల్దార్ సతీష్‌కుమార్, కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

మందమర్రి మున్సిపాలిటీ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. బుధవారం పట్టణంలోని దీపక్‌నగర్‌లో కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ మున్సిపాలిటీలోని 24 వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు చేశామన్నారు. క్యాతన్‌పల్లి మున్సిపాలిటి పరిధిలో ఆర్‌ఆర్‌నగర్‌లో 15వ పట్టణ ప్రగతి ఆర్థిక సంఘం 50లక్షల నిధులతో శ్మశానవాటికి, అంతర్గత రహదారి నిర్మాణం, వెయిటింగ్ హాల్, డ్రెస్సింగ్ రూంనకు పనులకు శంకుస్థాపన చేశారు.

క్రికెట్ క్రీడాకారులకు చేయూత

దివంగత కాకా తన తండ్రి వెంకటస్వామి మెమోరియల్ ద్వారా క్రికెట్ క్రీడాకారులకు చేయూతనిస్తామని మంత్రి డాక్టర్ జి వివేక్ వెంకటస్వామి తెలిపారు. రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో కాకా మెమోరియల్ టీ20లీగ్ క్రికెట్ టోర్నమెంటుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విశాఖ చారిట్రబుల్ ట్రస్టు ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆదరణకు నోచుకోని క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, తవక్కల్ విద్యాసంస్థల చైర్మన్ అబ్దుల్ అజీజ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి జర్నలిస్టుల అరెస్టు తగదు

- నోటీసులు ఇచ్చి విచారణకు పిలిస్తే చాలా బాగుండేది
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 14: అర్ధరాత్రి జర్నలిస్టులను అరెస్టు చేయడాన్ని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఖండించారు. అధికారులు ఎవరినైతే విచారణ చేయాలని అనుకుంటున్నారో వాళ్లకు నోటీసులు ఇచ్చి విచారణకు పిలిస్తే చాలా బాగుండేది ఆయన అన్నారు. పండుగ పూట సీనియర్ జర్నలిస్టులను విచారణ పేరుతో మధ్య రాత్రి అరెస్టులు చేసి తీసుకెళ్లడం వల్ల ప్రభుత్వం కొంత ఇబ్బందుల పాలు అవుతుందని, ఇది ప్రతిపక్షాలకు అస్త్రంగా ఉపయోగేపడే పరిస్థితి ఉంటుందని ఆయన అన్నారు. ఇటీవల కొన్ని చానళ్లలో మంత్రుల మీద, ఉన్నతాధికారుల మీద వ్యక్తిగతంగా ఆధారాలు లేకుండా కించపరిచే విదంగా కథనాలు వచ్చాయని, ఆ విషయంలో తాను తీవ్రంగా స్పందించానని అన్నారు. అలాంటి వార్తలు వేయడం సమాజానికి మంచిది కాదని, ఇలాంటివి జరగకూడదని, మంత్రులు, ఐఏఎస్ అధికారులు కావడానికి వాళ్ళు ఎంత కష్టపడ్డారో.. వారి జీవితాలను ఇలా ప్రసారం చేయడం దుర్మార్గమని అన్నారు. అయితే ఈ నేపథ్యంలో అసలు విషయాలు ఏమిటి? ఎవరు దీనికి సూత్రధారులు అని తెలుసుకోవడానికి ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిట్ వేసి విచారణ కు ఆదేశాలు ఇచ్చారని, ఇది మంచిదే.. సిట్ కూడా సజ్జన్నార్ లాంటి సీనియర్ అధికారి తో వేయడం వల్ల నిజాలు బయటకు వస్తాయన్నారు. ఇలాంటి వార్తలు రాయడాన్ని ప్రతి ఒక్కరు తీవ్రంగా ఖండించాల్సిందే. ఒక మహిళ అధికారి పై ఇలా వేయడాన్ని ఎవరు సమర్థించారని అన్నారు. కానీ సిట్ అధికారులు ఈ విషయంలో చాలా సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు.

కూకట్‌పల్లిలో ఘనంగా కైట్ ఫెస్టివల్

- నల్లచెరువులో పతంగిని ఎగరేసిన హైడ్రా కమిషనర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, జనవరి 14: కూకట్పల్లి నల్ల చెరువులో బుధవారం పండగ వాతావరణం నెలకొంది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పతంగులు ఎగురవేయడంతో అందరిలో జోష్ కనిపించింది. స్థానికుల ఆహ్వానం మేరకు హైడ్రా కమిషనర్ కూకట్పల్లి నల్ల చెరువు చెంత కైట్ ఫెస్టివల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2024 సెప్టెంబరులో ఇక్కడ చెరువు విస్తరణ చేపట్టినప్పుడు తీవ్ర నిరసనలు ఎదురయ్యాయని, నేడు పండగ వాతావరణం నెలకొందని అన్నారు. కబ్జాలతో 16 ఎకరాలకు కుంచించుకుపోయిన నల్ల చెరువును 30 ఎకరాలకు విస్తరించామన్నారు. 10 అడుగుల మేర పేరుకుపోయిన పూడికను తొలగించి చెరువుకు మురికిని వదిలించామన్నారు. చెరువు లోతును పెంచడం ద్వారా పరిసర ప్రాంతాల్లో వరదలకు చెక్ పెడుతున్నామన్నారు. ఇప్పుడు చెరువును చూస్తే ఎంతో ఆహ్లాదంగా ఉందని అన్నారు. ఇక్కడ షటిల్ కోర్టు, కమ్యూనిటీ హాల్, యోగ కేంద్రం, సైకిల్ ట్రాక్, పికిల్ బాల్, ఇలా అనేక క్రీడలు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఇవన్నీ ప్రజలు ఉచితంగా వినియోగించేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మరో 14 చెరువులను తీర్చిదిద్దుతాం..

హైడ్రా మొదటి విడత 6 చెరువులు అభివృద్ధి చేయగా ఇప్పటికే బతుకమ్మకుంటను ప్రారంభించామని, మరో 3 చెరువులను ఫిబ్రవరిలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. వీటికి తోడు మరో 14 చెరువులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్దేశించిందని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. నగరంలో 100 చెరువులు అభివృద్ధి జరిగితే చాలావరకు వరదలను నియంత్రించవచ్చు అని అన్నారు. మురికి కూపాలుగా ఉన్న చెరువులను ఆహ్లాదకరంగా మార్చుతున్నామని.. దీంతో భూగర్భ జలాలు పెరగడమే కాకుండా మంచి నీరు అందుబాటులోకి వస్తుందన్నారు. మొత్తమ్మీద చెరువులు వేడుకలకు వేదికలవ్వడం ఎంతో ఆనందాన్నిచ్చిందన్నారు.

ములుగు జిల్లా రద్దు చేయం

- మంత్రి సీతక్క క్లారిటీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, జనవరి 14: తెలంగాణలో జిల్లాల పునర్విభజన చేపడతామని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వం అశాస్త్రీయంగా ఈ జిల్లాలను ఏర్పాటు చేసిందని, రాబోయే రోజుల్లో హేతుబద్ధంగా పునర్విభజన చేపడతామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. దీనికోసం విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో త్వరలో జ్యుడిషియల్ కమిషన్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో పలు జిల్లాలు రద్దు అవుతాయని విస్తృతంగా ప్రచారం నడుస్తోంది. ఈ నేపథ్యంలో ములుగు జిల్లా కూడా రద్దవుతోందని ప్రచారం జరుగుతున్న క్రమంలో ఈ ప్రచారాన్ని మంత్రి సీతక్క ఖండించారు. "ములుగు జిల్లా ఏర్పాటు కోసం పోరాడిన వాళ్లం. అలాంటిది ములుగు జిల్లాను ఎందుకు రద్దు చేస్తాం..? టీఆర్ఎస్ హయంలో నూతన జిల్లాల ఏర్పాటు అశాస్త్రీయంగా జరిగింది. పాలనా సౌలభ్యాన్ని పట్టించుకోకుండా, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోకుండా అస్తవ్యస్తంగా జిల్లాల సరిహద్దులను నిర్ణయించారు. ఒక మండలం మొత్తం ఒకే జిల్లాలో ఉండాలన్నది ప్రజల కోరిక" అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. "ములుగు జిల్లాలో ఒక మండలం ఉంటుంది. అందులోని ఐదు గ్రామాలు పక్కన భూపాలపల్లి జిల్లాలో ఉంటాయి. అలాంటప్పుడు ప్రజలకు పాలనా ఫలాలు ఎలా అందుతాయి. రెవెన్యూ, పోలీసు సరిహద్దులు ఒకేలా ఉండాలి. కానీ ఆ విధానాన్ని కేసీఆర్ అవలంబించలేదు. దీంతో జిల్లాల సరిహద్దు గ్రామాల ప్రజలు రెండు జిల్లాల కలెక్టరేట్ల చుట్టూ తిరగాల్సి వస్తుంది. అభివృద్ధి పరమైన సమీక్ష సమావేశాల సంబంధించి ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అందుకే శాస్త్రీయ పద్ధతిలో జిల్లాల సరిహద్దు విషయంలో స్వల్ప మార్పులు ఉంటాయని సీఎం చెప్పారు" అని మంత్రి సీతక్క తెలిపారు. "ములుగు జిల్లా ఏర్పాటు నచ్చని వాళ్లే ములుగు జిల్లా రద్దవుతోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ తప్పుడు ప్రచారాన్ని ములుగు జిల్లా ప్రజలు నమ్మి ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ములుగు జిల్లా అభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వందల కోట్లు ఖర్చు చేస్తుంది. అలాంటప్పుడు ములుగు జిల్లా రద్దు అనే ప్రశ్న ఉత్పన్నం కాదు. ములుగు ప్రజలు ఎవరు ఆందోళన పడొద్దు. ములుగు జిల్లా ఎక్కడికి పోదు.. ఇక్కడే ఉంటుంది.. అభివృద్ధి పథంలో అగ్ర భాగాన నిలుస్తుంది" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

ఉర్సు ఉత్సవం.. ఐక్యతా మహోత్సవం

- జహంగీర్ పీర్ దర్గాలో ఉత్సవాలకు రంగం సిద్ధం
- సీఎం రేవంత్ సహా ప్రముఖులకు ఆహ్వానం
- ఉత్సవాలకు రూ.14 లక్షలు విడుదల
- ఏర్పాట్లు పరిశీలించిన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అలీ ఖాన్ బాబర్

ప్రతిపక్షం, షాద్ నగర్, జనవరి 14: జహంగీర్ పీర్ దర్గాలో ఈనెల 15 నుంచి జరగనున్న ఉర్సు ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం ఏర్పాట్లను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఉర్సు నిర్వహణ నిమిత్తం ప్రభుత్వం రు. 14.1 లక్షలు మంజూరు చేసింది. ఈ నెల 15 గురువారం రోజున ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు 25 రజ్జబ్ ముర్జజ్జబ్ 1447 హిజ్రి కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 4.45 కు విందు కార్యక్రమం, అనంతరం నాతియా ముషాయిరా, ఇషా నమాజ్, అనంతరం ఖవాలీకార్యక్రమాలు ఉంటాయి. ఇక 16న 26 రజ్జబ్ ఉల్ మురజ్జబ్, జైసా పైజాన్ ఔలియా, ఇషా నమాజ్ అనంతరం ఖవాలీ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇక చివరి రోజు అయిన 17న ఖత్మే ఖురాన్ కార్యక్రమం ఉంటుంది.

ప్రముఖులకు ఆహ్వానం..

ఈ సందర్భంగా చివరి రోజున జరిగే కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోపాటు, ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రులు శ్రీధర్ బాబు, అజహరుద్దీన్, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లతోపాటు ప్రముఖులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ మాట్లాడుతూ ఈ ఏడాది కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసిందని అన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. దర్గా వద్ద 14 లక్షల రూపాయల నిధులతో ఉర్సు ఉత్సవాల పనులు చేపట్టామని మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తెలిపారు.



ఈ సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. పల్లె సీమలు ఆధునికతను సంతరించుకున్నా మన సంప్రదాయాలను మరచిపోకుండా పాటించాలని కోరుకుంటున్నాను. అందరికీ అనువైన పథకాలతో ప్రభుత్వం మరింత బాధ్యతతో వ్యవహరిస్తుందని హామీ ఇస్తున్నాను. రాష్ట్ర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు.
- ఏపీ సీఎం చంద్రబాబు

ప్రతిపక్షం
Prathipaksham.in
4
హైదరాబాద్
గురువారం
15.01.2026
@prathipaksham
prathipakshamtvtelugu

వెనిజులాపై ట్రంప్ కన్ను అందుకేనా?

ప్రపంచంపై ఆధిపత్యం చలాయించాలని అమెరికా ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుంది. తాజాగా వెనిజులా పరిణామాల వెనుక పెద్దన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అడుగులు అదే తెలియచేస్తున్నాయి. వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా సైన్యం అదుపులోకి తీసుకున్నాక అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటనలు చేశారు. చమురు, ఎన్నికలు, ఇన్‌ఛార్జ్‌పై కీలక వ్యాఖ్యలు చేశారు. వెనిజులా భవిష్యత్ ప్రణాళికను ట్రంప్ వెల్లడించారు.ఎన్‌బీసీ న్యూస్‌తో ట్రంప్ మాట్లాడుతూ.. వెనిజులాకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించగా.. ఒకే మాటలో 'నేనే' అన్నారు. ఇక వెనిజులాపై అమెరికా యుద్ధం చేయడం లేదని తెలిపారు. అలాగే సమీప భవిష్యత్‌లో ఎన్నికలు కూడా నిర్వహించబోమని తేల్చిచెప్పారు. దక్షిణ అమెరికా దేశాన్ని చక్కదిద్దడమే కర్తవ్యం అన్నారు.. పీఠంపై కూర్చొన్న ఏడాది లోపే వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురోను అదుపులోకి తీసుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఇది వెనిజులాలో తనకి అనుకూలమైన ప్రభుత్వాన్ని నియమించబోతున్నారనే ఊహాగానాలకు దారితీసింది. మదురో అరెస్టు తర్వాత అమెరికా తదుపరి చర్యలపై ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. గతంలో ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌కు పట్టిన గతి మదురోకు కూడా పడుతుందా అనే చర్చ కొనసాగుతోంది.అమెరికా దృష్టిలో నికోలస్ మదురో ఒక అంతర్జాతీయ డ్రగ్ గ్రూప్ నాయకుడు. అందువల్ల, మదురోను పట్టుకున్న వారికి లేదా దోషిగా తేల్చినట్లు సమాచారం అందించిన వారికి 50 మిలియన్ డాలర్లు (దాదాపు 450 కోట్లు) బహుమతిగా ఇస్తామని గత ఏడాది అమెరికా ప్రకటించింది. ఇది అమెరికా నార్కోటిక్స్ రివార్డ్స్ ప్రోగ్రాం కింద ప్రకటించిన అత్యధిక బహుమతి. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుండి మదురోపై తన దృష్టిని కేంద్రీకరించారు.మదురో అరెస్ట్‌తో డ్రగ్ ట్రాఫికింగ్ ఆగిపోతుందని అమెరికా భావిస్తోంది. తమకు దక్కాల్సిన ఆయిల్ తిరిగి వస్తుందని జేడీ వాన్స్ ప్రకటించారు. ఇక మదురోపై అమెరికాలో బలమైన అభియోగాలు నమోదు చేసేందుకు రంగం సిద్ధమైంది. బ్రూక్లిన్‌లోని మెట్రోపాలిటన్ డిటెన్షన్ సెంటర్లోనే మదురో ని ఉంచారు.నార్కో టెర్రరిజం, కొకైన్ దిగుమతి కుట్ర, అక్రమంగా విధ్వంసకర ఆయుధాలను కలిగిఉండడం, విధ్వంసక ఆయుధాలను స్మగ్లింగ్ చేసే కుట్రపన్నారంటూ అనేక అభియోగాలు వెనెజులా అధ్యక్షుడు మదురోపై నమోదు చేసింది అమెరికా.

జి.సత్యనారాయణరాజు
9030880709

మదురో 2013లో హ్యూగో చావెజ్ మరణానంతరం వెనిజులా అధికారంలోకి వచ్చారు. 2019 నుండి ఆయన నాయకత్వంపై వివాదాలు కొనసాగుతున్నాయి. అధికారాన్ని అక్రమంగా చేజిక్కించుకున్నాడని వెనిజులా నేషనల్ అసెంబ్లీ ప్రకటించింది. అమెరికాతో సహా 50కి పైగా దేశాలు మదురోను చట్టబద్ధమైన నాయకుడిగా గుర్తించడం లేదు. 2024 జూలైలో జరిగిన వివాదాస్పద ఎన్నికల్లో మదురో గెలుపును అమెరికా తిరస్కరించింది. ప్రతిపక్ష నాయకుడు రోడ్రిక్స్‌ను తాత్కాలిక అధినేతగా గుర్తిస్తామని ప్రకటించింది.అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ నికోలస్ మదురోపై తీవ్రమైన ఆరోపణలు చేస్తోంది. కార్టెల్ ఆఫ్ ది సన్స్ అనే డ్రగ్ ట్రాఫికింగ్ సంస్థకు మదురో నాయకత్వం వహిస్తున్నాడని, దీనికి వెనిజులాలోని ఉన్నత స్థాయి అధికారులు కూడా మద్దతు ఇస్తున్నారని అమెరికా స్టేట్ హోం డిపార్ట్‌మెంట్ పేర్కొంది. కొలంబియాలోని FARC తిరుగుబాటుదారులతో కలిసి భారీ మొత్తంలో కొకైన్‌ను తరలించాడని, ఆయుధాలు సరఫరా చేశాడని, మధ్య అమెరికా ద్వారా రవాణా మార్గాలను సులభతరం చేశాడని, సాయుధ మిలీషియా గ్రూపులకు మద్దతు ఇచ్చాడని అమెరికా ఆరోపిస్తోంది.ఈ పరిణామాలపై అంతర్జాతీయంగా భిన్న స్పందనలు వ్యక్తమయ్యాయి. బ్రెజిల్, క్యూబా సహా అనేక దేశాలు ఈ వ్యవహారంపై మండిపడ్డాయి. భారతదేశం కూడా తక్షణం ఉద్రిక్తతలు తగ్గేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. చైనా అమెరికా చర్యను తప్పుపట్టడంతో సరిపుచ్చింది. గత కొంతకాలంగా వెనిజులాలో చమురు పరిశ్రమ సంక్షోభంలో ఉంది. అమెరికా సైనిక, రాజకీయ జోక్యాలకు బలైన చమురు సంపన్న దేశాలలో వెనిజులా మొదటిది కాదు. 2003లో ఇరాక్‌పై అమెరికా చర్యలకు దిగింది. భద్రతా కారణాల పేరుతో సమర్థించుకునే యత్నం చేసినా.. ఇందులో చమురు నియంత్రణ కీలకపాత్ర పోషించింది. ఇక 2011లో లిబియాలో నాటో జోక్యం చేసుకున్నది. ఆ తర్వాత చమురు సంపన్న దేశమైన లిబియా దీర్ఘకాలిక రాజకీయ అస్థిరతలో చిక్కుకున్నది. చమురు వనరులపై నియంత్రణ కోల్పోవడమే దేశాన్ని అస్తవ్యస్తం చేసిందని నిపుణులు చెప్తున్నారు. ఇక క్యూబాలో పరిమిత చమురు నిల్వలే ఉన్నప్పటికీ.. ఆ దేశంపై దశాబ్దాల పాటు అమెరికా ఆంక్షలు కొనసాగాయి. ఇవి కేవలం ఆర్థిక ఆంక్షలు కాకుండా, లాటిన్ అమెరికా ప్రాంతంపై వ్యూహాత్మక నియంత్రణ సాధించాలన్న లక్ష్యంతో విధించబడ్డాయని నిపుణులు గుర్తు చేస్తున్నారు. చైనా, భారత్ తదితర కొద్ది దేశాలు మాత్రమే వెనిజులా నుంచి చమురును కొనుగోలు చేస్తున్నాయి. అమెరికా ఆంక్షలకు జడిసి చాలా దేశాలు వెనెజువెలా చమురును కొనేందుకు సాహసించలేదు. కొనేందుకు ఎవరూ రాక, గిరాకీ లేక చమురు వెలికితీతను వెనిజులా తగ్గించేసింది. ఇలాంటి పరిస్థితుల్లో ట్రంప్ స్ట్రాటజీ అంతగా ప్రయోజనాలు కలిగించదని అంతర్జాతీయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

(వ్యాసకర్త
సీనియర్ జర్నలిస్ట్)

సబ్బండ కులాల చైతన్యమే... అగ్రకులాల సింహగర్జన

తెలంగాణ రాష్ట్రంలో పలు గ్రామాల్లో సర్పంచులు, వార్డ్ మెంబర్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీల గెలుపు తెలంగాణ చరిత్రలో మొదటిసారి సామాజిక, రాజకీయ ముఖచిత్రాన్ని మార్చింది. ఇది భవిష్యత్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల విజయానికి పునాది పడనుంది. ఈ విజయాలను అగ్రకులాల పార్టీ నాయకుల సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. మరోవైపు అగ్రకులాల కూటమి జతకట్టి మూడు నెలల క్రితం కరీంనగర్ గడ్డపై జాక్ (JAC)ఏర్పడింది.

సంపతి రమేష్ మహారాజ్
7989579428

భారతదేశంలో విప్లవం అనే పదాన్ని వామపక్ష పార్టీలు సంకుచిత అర్థాలకు పరిమితం చేశాయి. రేషన్ కార్డు, పెన్షన్, సంక్షేమ పథకాల కోసం చేసే పోరాటాలే విప్లవమని అట్టడుగు కులాలకు నేర్పించారు. ఈ క్రమంలో దోపిడీకి గురవుతున్న బహుజన సమాజం జెండాలు పట్టుకొని తమ హక్కుల కోసం రోడ్లపైకి వచ్చి విప్లవమని భ్రమించారు. కానీ,""విప్లవం అంటే తరతరాలుగా దోపిడీ చేస్తున్న అగ్రకులాలు మాకు న్యాయం కావాలనీ రోడ్లెక్కడం"". భారతదేశ చరిత్రలో ఇప్పటివరకు ఈ సంఘటనలు రెండుసార్లు మాత్రమే జరిగాయి. ఒకటి 1950 జనవరి 26 తరువాత. రాజ్యాంగం అమలులోకి రావడంతో అగ్రకులాలు తమ అదనపు హక్కులు కోల్పోతున్నామని భావించి, ఎన్.డి. తివారి నాయకత్వంలో రాజ్యాంగాన్ని కాల్చి నిరసనకు దిగారు. రెండవది 1990లో మండల్ కమిషన్ అమలుకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన అగ్రకుల ఆందోళనలు అని చెప్పవచ్చు. ఈ రెండు సందర్భాల్లోనూ బహుజనులకు భారత రాజ్యాంగం హక్కులైన విద్య ,ఉద్యోగ, రాజకీయ అవకాశాలు దగ్గరవడమే దీనికి కారణం. ఈ చారిత్రక అనివార్యతను సృష్టించిన వ్యక్తులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్, మాన్యువార్ కాన్షీరాం గారే. ఇప్పుడు అదే అనివార్యతను తెలంగాణలో బీసీ ఉద్యమం సృష్టిస్తోంది. ఈ క్రమంలో ఓసీ జేఏసీ పేరుతో అగ్రకులాలు ఏకమయ్యారు. ఇటీవల వరంగల్ కేంద్రంగా జరిగిన అగ్రకులాల సింహగర్జన జరిగింది. తమ హక్కుల కోసం పోరాడడం ఆహ్వానించ దగ్గ విషయమే. కానీ నిచ్చెన మెట్ల ఈ కులవ్యవస్థలో పైస్థాయిలో నిలిచి, అన్ని అవకాశాలు అనుభవించిన వర్గాలు రోడ్లపైకి రావడం ఒక కొత్త పరిణామం. ఇదే విప్లవ లక్షణం. మానవీయతను చాటాల్సిన సందర్భం ఇది. ఇది సబ్బండ కులాల చైతన్యానికి నాందిగా చెప్పవచ్చు.

బహుజన విజయాలకు పునాది

చారిత్రకంగా మనుధర్మ శాస్త్రం బీసీ, ఎస్సీ, ఎస్టీ కులాలను ఊరికి "సేవ చేసే కులాలు"గా ముద్ర వేసింది. కానీ భారత రాజ్యాంగం అదే కులాలను గ్రామానికి ప్రథమ పౌరులు కావాలని చెప్పింది. దీని ఫలితమే తెలంగాణ గ్రామపంచాయతీ ఎన్నికల్లో బహుజనుల అద్భుత ప్రజాస్వామ్య రాజ్యాంగ విజయం. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన గణాంకాల ప్రకారం 86.4 శాతం సర్పంచ్ స్థానాలు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు గెలుచుకున్నాయి. కేవలం 13.6 శాతం మాత్రమే జనరల్ అభ్యర్థులకు దక్కాయి. ఇది యాదృచ్ఛిక విజయం కాదు. డాక్టర్ విశారదన్ మహారాజ్, రిటైర్డ్ ఐఏఎస్ టీ. చిరంజీవులు, జస్టిస్ ఈశ్వరయ్య, బాలరాజు గౌడ్ ఆధ్వర్యంలో 42 శాతం రిజర్వేషన్ల ఉద్యమం తెచ్చిన చైతన్యమే దీనికి మూలం. మరోవైపు బీసీ, ఎస్సీ, ఎస్టీలు సంఘటితమై మార్చి31 2025 ఏర్పడిన జాక్(JAC) ఆధ్వర్యంలో కొనసాగుతున్న లక్ష కిలోమీటర్ల రథయాత్ర. ఈ ఉద్యమాల ప్రభావంతో పంచాయతీ ఎన్నికల్లో

బహుజనులు చారిత్రాత్మక విజయాలను సాధించారు. జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం సిరికొండ గ్రామంలో, బీసీ వర్గానికి చెందిన పంచిత ధర్మరాజు యాదవ్ అత్యధిక డబ్బు ఖర్చుచేసి అగ్రకుల నాయకుడిపై ఒక్క ఓటు తేడాతో గెలవడం ఒక చారిత్రక సంకేతం. రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేటలో ముదిరాజ్ కులానికి చెందిన మాస్కురి కాశిరామ్ అగ్రకులాలన్నీ ఏకమై నిలబెట్టిన అభ్యర్థిపై భారీ మెజారిటీతో విజయం సాధించడం రాజకీయ చైతన్యానికి నిదర్శనం. వీరి విజయానికి కారణం తెలంగాణ వ్యాప్తంగా రాజకీయ చైతన్యాన్ని రగిలిస్తున్న డాక్టర్ విశారదన్ మహారాజ్ మాటలేనని రుజువైంది. ఇలా తెలంగాణ రాష్ట్రంలో పలు గ్రామాల్లో సర్పంచులు, వార్డ్ మెంబర్లుగా బీసీ, ఎస్సీ, ఎస్టీల గెలుపు తెలంగాణ చరిత్రలో మొదటిసారి సామాజిక, రాజకీయ ముఖచిత్రాన్ని మార్చింది. ఇది భవిష్యత్ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల విజయానికి పునాది పడనుంది. ఈ విజయాలను అగ్రకులాల పార్టీ నాయకుల సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. మరోవైపు అగ్రకులాల కూటమి జతకట్టి మూడు నెలల క్రితం కరీంనగర్ గడ్డపై జాక్(JAC)ఏర్పడింది. ఇది రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించి మొన్న వరంగల్ కేంద్రంగా సింహగర్జన జరిగింది. విద్యా ఉద్యోగ సహా అన్ని రంగాల్లో వారికి జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా ,ఓసి కమిషన్ ఏర్పాటు చేసి ఓసిల సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీసీ ఉద్యమ అనివార్యతతో అగ్రకులాలన్నీ రోడ్లపైకి వచ్చి న్యాయం కావాలని అడగడం మూడో విప్లవానికి సంకేతం.

పీడిత కులాలకు పంచడమే మానవత్వం.

రక్తపాతం లేకుండా, శాంతియుతంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ విప్లవం తేవడమే భారత రాజ్యాంగ లక్ష్యం. కానీ దీనికి కులాధిపత్యం నిరంతరం అడ్డువస్తుంది. భారత రాజ్యాంగం ప్రకారం అందరం సమానమే, జనాభా ప్రకారం అందరికీ సమాన అవకాశాలు దక్కాలి. శివుని సమానత్వం, బసవేశ్వరుని సమానత్వం కూడా ఇందులో ఇమిడి ఉంది. కానీ ఇంకా అన్ని రంగాల్లోనూ సమానత్వానికి, సమాన అవకాశాలకు అట్టడగు కులాలు దూరంగానే ఉన్నారు. తెలంగాణ రాజకీయాలను పరిశీలిస్తే... 10 శాతం కూడా లేని అగ్రకులాలు అన్ని రంగాల్లో ఆధిక్యతను కలిగి 90 శాతం ప్రజలను పాలిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో 119 మంది ఎమ్మెల్యేలకు గాను అగ్రకులాలు నుంచి మొత్తం 62 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వీరి జనాభా 10 శాతంలోపే ఉంది. మరోవైపు 56 బీసీ జనాభా గాను వారిలో 19 ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. ఇదెక్కడి సామాజిక న్యాయం? ఇది ప్రజాస్వామ్యం కాదు, ఇది కుల స్వామ్యం అని నిర్ధారణ అవుతుంది. ఈ కులాధిపత్య రాజకీయాలపై అగ్రకుల ప్రజాస్వామిక వాదులు, బహుజన మేధావులు ఆలోచించాల్సిన అవసరం ఉంది. మరోవైపు ప్రతిభ పేరుతో బలవంతులే అవకాశాలు కొల్లగొడుతున్నారు. ఇది ఆటవిక సమాజ లక్షణం. నాగరిక సమాజంలో ప్రజాస్వామ్య సంక్షేమ రాజ్యానికి విరుద్ధం. దేశ జనాభాలో ఎవరెంతో వారికంత చెందడమే ప్రజాస్వామ్య సంక్షేమ రాజ్య స్ఫూర్తి. ఈ క్రమంలో అట్టడుగు కులాలతో పాటు అగ్రకులాలకు సైతం వారి జనాభా దామాషా ప్రకారం అవకాశాలు దక్కాలి. ఇదే మానవీయత. అగ్రకులాలు ఈ సత్యాన్ని అంగీకరించాలి. ఇప్పుడిప్పుడే సామాజిక, ఆర్థిక, రాజకీయ విముక్తి కోసం బీసీ,ఎస్సీ,ఎస్టీ సమాజం చేస్తున్న పోరాటాలకు మద్దతు ఇవ్వాలి. లేదంటే చరిత్ర అగ్రకులాలను దోపిడీ కులాలుగానే గుర్తిస్తుంది.

(వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు)

బంగారు భవిష్యత్తుపై కల్తీ విషం!?

వెంకగారి భూమయ్య
9848559863

దేశ భవిష్యత్తుకు ప్రాణవాయువు వంటి పసిపిల్లల ఆరోగ్యం నేడు కల్తీ మందుల కోరల్లో చిక్కుకుని విలవిల్లాడుతోంది. ప్రాణాలను కాపాడాల్సిన ఔషధాలే మృత్యుపాశాలుగా మారుతున్న ఉదంతాలు వరుసగా వెలుగులోకి వస్తుండటం పౌర సమాజాన్ని ఉలిక్కిపడేలా చేస్తోంది. ఇటీవల బయటపడిన ప్రాణాంతక మందుల వ్యవహారం కేవలం ఒక సంస్థ చేసిన పొరపాటుగా చూడలేం; ఇది వ్యవస్థీకృత వైఫల్యంగా మరియు పాలకుల ఉదాసీనతకు నిదర్శనంగా కనిపిస్తోంది. ఒక మందు విపణిలోకి వచ్చి వేలాది మంది పిల్లల శరీరాల్లోకి ప్రవేశించిన తర్వాత, అది విషపూరితమని అధికారులు గుర్తించడం వల్ల ప్రయోజనం ఏమిటనే నిలదీతలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

నియంత్రణ సంస్థల ఘోర వైఫల్యం

ఈ ప్రాణాంతక పరిస్థితులకు తెలంగాణ డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (DCA), సెంట్రల్ డ్రగ్స్ స్టాండర్డ్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (CDSCO) ల నిర్లక్ష్యమే ప్రధాన కారణమని స్పష్టమవుతోంది. మందుల నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాల్సిన ఈ సంస్థలు, కేవలం కార్యాలయాలకే పరిమితమవ్వడం వల్ల కల్తీ మాఫియా చెలరేగిపోతోంది. క్షేత్రస్థాయిలో తయారీ కేంద్రాలను తనిఖీ చేయడంలో, ముడి పదార్థాల నాణ్యతను పరీక్షించడంలో ఈ రెండు కీలక సంస్థలు ఘోరంగా విఫలమయ్యాయి. అనుమతులు ఇచ్చే సమయంలో చూపించే అత్యుత్సాహం, నాణ్యతను పరీక్షించే సమయంలో మృగ్యమవుతోంది. అధికారుల పర్యవేక్షణా లోపం వల్లే విషపూరిత రసాయనాలు మందుల్లోకి చేరుతున్నాయని నిపుణులు మండిపడుతున్నారు.

జవాబుదారీతనం లేని యంత్రాంగం

ప్రస్తుత ఔషధ నియంత్రణ వ్యవస్థలో అత్యంత దారుణమైన విషయం ఏమిటంటే, తప్పు జరిగినప్పుడు బాధ్యతను ఒకరిపై ఒకరు నెట్టేసుకోవడం. కల్తీ మందులు మార్కెట్లోకి ఎలా వచ్చాయని ప్రశ్నిస్తే, కేంద్ర సంస్థ రాష్ట్ర విభాగంపై, రాష్ట్ర అధికారులు కేంద్ర నిబంధనలపై సాకులు చెబుతూ కాలయాపన చేస్తున్నారు. ప్రాణాంతకమైన 'ఇథలీన్ గ్లైకాల్' వంటి రసాయనాలు కలవకుండా చూడాల్సిన బాధ్యత కేవలం కంపెనీలదే అన్నట్లుగా అధికారులు వ్యవహరించడం విస్మయానికి గురిచేస్తోంది. తయారీ లైసెన్సుల మంజూరులో ఉన్న వేగంలో పదో వంతు కూడా నాణ్యత తనిఖీల్లో లేకపోవడం వ్యవస్థలోని డొల్లతనాన్ని బయటపెడుతోంది. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కంపెనీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంలో చూపిస్తున్న జాప్యం, పరోక్షంగా కల్తీ ముఠాలకు కొమ్ము కాస్తున్నట్లుగా ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు ఏసీ గదుల నుంచి బయటకు వచ్చి క్షేత్రస్థాయిలో నిరంతర తనిఖీలు చేపట్టకపోతే, ఔషధ నియంత్రణ విభాగం ఉనికికే అర్థం లేదని బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతుల ప్రక్రియలో అంతులేని లొసుగులు

ఔషధ అనుమతుల ప్రక్రియలో ఉన్న లొసుగులు కల్తీ ముఠాలకు వరంగా మారుతున్నాయి. ఒక రాష్ట్రంలో తయారీ అనుమతి పొందిన కంపెనీ తన ఉత్పత్తులను దేశవ్యాప్తంగా ఎక్కడైనా విక్రయించవచ్చు. దీనివల్ల ఒక రాష్ట్రంలోని ఔషధ నియంత్రణ అధికారులకు మరో రాష్ట్రంలోని తయారీ కేంద్రాలను నేరుగా తనిఖీ చేసే అధికారం ఉండదు. కేవలం మందు దుకాణాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న నమూనాలను మాత్రమే వారు సేకరించగలరు. ఈ నమూనాలు సేకరించి, వాటిని ప్రయోగశాలకు పంపి నివేదిక వచ్చేసరికి నెలల సమయం పడుతోంది. ఈ లోపు ఆ విడతకు సంబంధించిన వేలాది సీసాలు అప్పటికే ప్రజల శరీరాల్లోకి చేరుతున్నాయి. ప్రాణాలు పోయాక 'వాడకం నిలిపివేయండి' అని నోటీసులు ఇవ్వడం అనేది యుద్ధం ముగిశాక ఆయుధాలు తీయడం వంటిదని విమర్శలు వస్తున్నాయి.

లాభాల వేటలో బలిపీఠంపై పసిప్రాణాలు

సాధారణంగా ఏదైనా ఒక ఔషధం తయారీ కేంద్రం నుంచి బయటకు రావడానికి ముందే దాని నాణ్యతను ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లో శాస్త్రీయంగా పరీక్షించాల్సిన అవసరం ఉంది. అయితే, ప్రస్తుతం అమలులో ఉన్న నిబంధనలు కంపెనీలకు మితిమీరిన వెసులుబాటును కల్పిస్తున్నాయి. 'స్వీయ ధృవీకరణ' పేరుతో కంపెనీలే తమ మందుల నాణ్యతను తామే నిర్ధారించుకుని విక్రయాలకు విడుదల చేసే అవకాశం ఉండటం పెను ప్రమాదానికి దారితీస్తోంది. ఈ వెసులుబాటునే పెట్టుబడిగా మార్చుకున్న కొన్ని స్వార్థపూరిత కంపెనీలు, లాభాల వేటలో ముడి పదార్థాల నాణ్యతను పూర్తిగా పక్కన పెడుతున్నాయి. ముఖ్యంగా ద్రవ రూప మందుల తయారీలో వాడే ఖరీదైన రసాయనాలకు బదులుగా, పారిశ్రామిక అవసరాల కోసం వాడే అత్యంత విషపూరితమైన పదార్థాలను వాడుతున్నాయి.

ప్రక్షాళన జరగాల్సింది వ్యవస్థలోనే

ఇకనైనా కేంద్ర ఔషధ నియంత్రణ సంస్థ (CDSCO) మరియు రాష్ట్రాల విభాగాలు మేల్కోవాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. కేవలం పత్రాల మీద సంతకాలు చేసి అనుమతులు ఇవ్వడమే కాకుండా, ప్రతి తయారీ దశలోనూ నిశితమైన నిఘా ఉంచాలి. మందు విపణిలోకి విడుదల కావడానికి ముందే ప్రతి విడతను స్వతంత్ర ప్రయోగశాలల ద్వారా పరీక్షించి, 'నాణ్యత ధృవీకరణ' పత్రం ఉంటేనే విక్రయాలకు అనుమతించాలనే నిబంధనను తక్షణమే అమల్లోకి తీసుకురావాలి. ప్రాణాలను కాపాడాల్సిన మందుల విషయంలో రాజకీయాలకు, అధికారుల అవినీతికి తావు లేకుండా కఠినమైన ప్రక్షాళన జరగాలి. లేనిపక్షంలో సామాన్యుడు ప్రతి చుక్క మందు వేసుకునేటప్పుడు తన ప్రాణంపై ఆశలు వదులుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుంది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

భూగర్భజలాల సంక్షోభం ... ముప్పులో మన రేపటి జీవితం

మలిపెద్ది పవన్ కళ్యాణ్
7093052815

నీరు లేకుండా జీవితం ఊహించలేం.అయినప్పటికీ, మనం నీటి విలువను సరిగ్గా గుర్తించకపోవడం వల్ల, ముఖ్యంగా భూగర్భజలాలు వేగంగా తగ్గిపోతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే, భవిష్యత్తులో తాగునీటి కోసం కూడా తీవ్ర సంక్షోభం ఎదురయ్యే ప్రమాదం ఉంది. ఇది కేవలం రైతుల సమస్య మాత్రమే కాదు,మొత్తం సమాజం ఎదుర్కొంటున్న పెద్ద సమస్యగా మారబోతోంది.భూమిపై నీటి వాస్తవ స్థితి భూమి ఉపరితలంపై సుమారు 71 శాతం నీరు ఉంది. అయితే ఇందులో ఎక్కువ భాగం సముద్రాల్లో ఉన్న ఉప్పు నీరు. దాదాపు 97 శాతం ఉప్పు నీరు కాగా, కేవలం 3 శాతం మాత్రమే తీపి నీరు. ఈ తీపి నీటిలో కూడా పెద్ద భాగం మంచు రూపంలో లేదా మనకు చేరని ప్రాంతాల్లో ఉంది. నిజంగా తాగడానికి, వ్యవసాయానికి ఉపయోగపడే నీరు మొత్తం నీటిలో ఒక శాతం కంటే కూడా తక్కువ. అంటే మనం వినియోగిస్తున్న నీరు అత్యంత పరిమితమైన వనరు.భూగర్భజలాలు 30 శాతం కంటే ఎక్కువ తగ్గుదలకు దారి తీస్తే తీవ్రమైన సంక్షోభం ఎదుర్కోవాల్సి వస్తుంది అని నిపుణులు చెపుతున్నారు.

భూగర్భజలాలు ఎందుకు తగ్గుతున్నాయి?

గ్రామీణ ప్రాంతాల్లో, ముఖ్యంగా వ్యవసాయంపై ఆధారపడిన ప్రాంతాల్లో, భూగర్భజలాల వినియోగం గత కొన్ని సంవత్సరాల్లో గణనీయంగా పెరిగింది. ఎక్కువగా బోర్లు వేయడం, నీటి అవసరం అధికంగా ఉండే వరి, మొక్కజొన్న వంటి పంటలను అధికంగా సాగు చేయడం, వర్షపు నీటిని నిల్వ చేయకపోవడం, చెరువులు,కుంటలు పూడికతో నిండిపోవడం, చెట్ల నరుకుడు వంటి కారణాలు భూగర్భజలాల తగ్గుదలకు ప్రధాన కారణాలుగా మారాయి.అదే విధంగా, వర్షపాతం తగ్గినా, పడిన వర్షం నేలలోకి చేరకుండా వృథాగా పోతుండడం కూడా మరో పెద్ద సమస్య.భూగర్భజలాలు తగ్గితే వచ్చే పరిణామాలు భూగర్భజలాలు తగ్గితే ముందుగా బోర్లు ఎండిపోతాయి. దాంతో తాగునీటి కొరత ఏర్పడుతుంది. వ్యవసాయం దెబ్బతింటుంది, పంట దిగుబడులు తగ్గుతాయి, రైతులు అప్పుల పాలవుతారు. గ్రామాల్లో జీవనాధారం కష్టమవడంతో ప్రజలు పట్టణాలకు వలస వెళ్లే పరిస్థితి ఏర్పడుతుంది.దీర్ఘకాలంలో ఆహార కొరత, ఆరోగ్య సమస్యలు, సమాజంలో ఘర్షణలు పెరిగే ప్రమాదం కూడా ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే నీటి కోసం గొడవలు జరుగుతున్న పరిస్థితిని మనం చూస్తున్నాం.

భూగర్భజలాలను ఎలా కాపాడాలి..?

ఈ పరిస్థితిని మార్చాలంటే ఇప్పుడే చర్యలు తీసుకోవాలి. రైతులు తక్కువ నీటి అవసరమైన పంటల వైపు దృష్టి

పెట్టాలి. డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక పద్ధతులను వినియోగించాలి. అవసరం లేకుండా వరుసగా బోర్లు వేయకుండా నియంత్రణ అవసరం.గ్రామ స్థాయిలో చెరువులు, కుంటలను పునరుద్ధరించడం, వర్షపు నీటి సంరక్షణ (రెయిన్ వాటర్ హార్వెస్టింగ్) అమలు చేయడం, చెట్లు విస్తృతంగా నాటడం వంటి చర్యలు అత్యంత అవసరం. ప్రతి ఇంట్లో నీటి వృథాను తగ్గించే అలవాటు పెంపొందించాలి.నీరు కాపాడితేనే రేపటి జీవనం నీరు కేవలం ఒక వనరు కాదు అది జీవనాధారం. నేడు మనం నిర్లక్ష్యం చేస్తే, రేపు మన పిల్లలకు తాగడానికి నీరు కూడా దొరకని పరిస్థితి రావచ్చు. అందుకే నీటిని పొదుపుగా వినియోగించడం ప్రతి పౌరుడి బాధ్యత. నీటిని కాపాడటం అంటే భవిష్యత్తును కాపాడటమే.

(వ్యాసకర్త జర్నలిస్టు, గుండాల)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

ఐనవోలు బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మంత్రి సురేఖ

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, జనవరి 14: భోగి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం హన్మకొండ జిల్లా ఐనవోలు మండల కేంద్రంలో ఉన్న ప్రసిద్ధ శైవక్షేత్రం ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండ సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు హాజరైన మంత్రి కొండ సురేఖకు ఆలయ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు మంత్రి, ఎమ్మెల్యేలకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి వేదమంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి ఆశీర్వచనాలు అందజేశారు. తీర్థ-ప్రసాదాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి, ఎమ్మెల్యేలు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. అలాగే ఐనవోలు జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక బస్‌స్టాండ్‌ను మంత్రి కొండ సురేఖ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండ సురేఖ మాట్లాడుతూ భోగి పర్వదినాన ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. స్వామివారి కృపతో రాష్ట్ర ప్రజలందరికీ శాంతి, శ్రేయస్సు, సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ భోగి పర్వదినం సందర్భంగా బ్రహ్మోత్సవాల్లో పాల్గొనడం అపారమైన ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందన్నారు. ఆలయ కమిటీ, దేవాదాయ శాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పని చేస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ టెస్కాబ్ ఛైర్మన్ మార్నేనీ రవీందర్ రావు, ఆలయ కమిటీ ఛైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఆలయ ఈవో సుధాకర్, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అరెస్టు అక్రమం

- **ఖండించిన టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్**

ప్రతిపక్షం, హుస్నాబాద్, జనవరి 14: మహిళా ఐఏఎస్ అధికారిపై ప్రసారమైన కథనంపై ఎటువంటి విచారణ చేయకుండా, ముందస్తు నోటీసు ఇవ్వకుండా సిట్ పోలీసులు ముగ్గురు సీనియర్ జర్నలిస్టులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) హుస్నాబాద్ డివిజన్ యూనియన్ తీవ్రంగా ఖండిచింది. ఈ సందర్భంగా టీడబ్ల్యుజేఎఫ్ డివిజన్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎన్టీవీలో వచ్చిన కథనానికి జర్నలిస్టులు దొంతు రమేశ్, పరిపూర్ణ చారి, సుధీర్లను బాధ్యులను చేస్తూ 'సిట్' పోలీసులు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నేరుగా అరెస్టు చేయడం దారుణమని మండిపడ్డారు. మీడియాలో ప్రసారమయ్యే, ప్రచురితమయ్యే కథనాలకు ఆ సంస్థ ఎడిటర్, బోర్డు ఆఫ్ డైరెక్టర్లతో పాటు సంస్థ యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆరోపించారు. సంస్థలో పని చేసే జర్నలిస్టులను, ఇతర ఉద్యోగులను బాధ్యులను చేసి అరెస్టు చేయడం ఏమిటని ప్రశ్నించారు. తమది ప్రజా ప్రభుత్వం అని చెబుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రభుత్వంలోని అధికారులు అనుసరిస్తున్న విధానంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు. జర్నలిజంలో మూడు దశాబ్ధాలుగా పని చేస్తున్న ఈ ముగ్గురు జర్నలిస్టులపై కేసులు నమోదు చేయటం వెనుక కుట్ర ఉన్నట్లు కనిపిస్తోందని తెలిపారు. అరెస్టు చేసిన జర్నలిస్టులను వెంటనే విడుదల చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. బాధ్యులైన యాజమాన్యాలపై చర్యలు తీసుకోకుండా అమాయక జర్నలిస్టులను అరెస్టు చేయడం సరైందికాదని, ఈ అక్రమ అరెస్టులు ఇతర జర్నలిస్టులను భయపెట్టేందుకు చేస్తున్న చర్యలని అన్నారు. ఈ సమావేశంలో టీడబ్ల్యూ జేఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు వరియోగుల మురళీధర్ స్వామి, జిల్లా కార్యదర్శి మహ్మద్ ఖుద్రత్ అలీ, డివిజన్ అధ్యక్షుడు గుర్రపు శ్రీనివాస్ డివిజన్ కార్యదర్శి జానవేణి శ్రీనివాస్ ఉపాధ్యక్షుడు కొత్తపూర్ణచందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు చెరుకు సతీష్, మీడియా కన్వీనర్ మార్క రాజు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం కృషి

- **కాంగ్రెస్ నాయకులు అమర్ నాథ్ రెడ్డి**

ప్రతిపక్షం, మొయినాబాద్, జనవరి 14 : రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎంకేపల్లి మాజీ సర్పంచ్ అమర్నాథ్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారము మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు నాయకులతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులందరూ ఏకతాటిగా పాల్గొని కాంగ్రెస్ పార్టీ ఎవరికి టికెట్ ఇచ్చి బీఫామ్ అందజేసిన వారికి కృషి చేస్తామని పేర్కొనడంతో అమర్నాథరెడ్డి అందరినీ సంతోషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ గెలుపు లక్ష్యంగా మనందరం కృషి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే సాగుతున్నాయని తెలిపారు. ప్రజలకు గ్రామాలలో అర్హులైన లబ్ధిదారులందరికీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కావడంతో ఈ కార్యక్రమం ఎంతో ఘనీయంగా సాగుతుందని అన్నారు. దశలవారీగా ఇందిరమ్మండ్లకు బిల్లులు చెల్లిస్తూ అభివృద్ధి పథంలో ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులందరినీ ఆయన అభినందించారు .జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముందంజలో ఉండాలని అందరం కృషి చేసుకుందామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, గ్రామ అధ్యక్షులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

తిరువాభరణ శోభాయాత్ర

ప్రతిపక్షం, హుస్నాబాద్, జనవరి 14: హుస్నాబాద్ పట్టణంలో తిరువాభరణ శోభాయాత్ర సందర్భంగా అయ్యప్ప స్వామికి తిరువాభరణాలు అలంకరించి శ్రీ భవాని సహిత కాశీ మరకత లింగేశ్వర దేవాలయం(శివాలయం) నుండి అయ్యప్ప స్వామి వారి దేవాలయం వరకు శోభా యాత్ర నిర్వహించారు. భక్తులు భజనలతో కోలాటాలతో స్వామివారి తిరువాభరణ శోభాయాత్ర అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వామి దేవాలయం చైర్మన్ ఆకుల వెంకన్న, ఆకుల రజిత వెంకన్న, సుద్దాల చంద్రయ్య, వడ్డేపల్లి రమణ, బొలిశెట్టి శివయ్య, డాక్టర్ కొంకటి రవి, చిత్తారి పద్మ, గోపగోని రేణుక శోభన్ గౌడ్, రోహన్ స్వామి, వల్లపు రాజు, పున్న సది, పేరుకా భాగ్యరెడ్డి, శ్రీకాంత్, శ్రీనాథ్, సంపత్, శివ, ఆలయ పూజారులు భానుమూర్తి, పవన్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
- **ఎం డి ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా రంగోలి, కైట్ ఫెస్టివల్**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 14 : తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పర్వదినం అని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని బుధవారం ఎండిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు మాదిరి పృధ్వి రాజ్ ఆధ్వర్యంలో పటాన్ చెరు పట్టణం లోని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన రంగోలి, కైట్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు సంవత్సరాలుగా పటాన్చెరు కేంద్రంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించడం పట్ల ఎం.డి. ఆర్ ఫౌండేషన్ ను అభినందించారు. తన బాల్యంలో సంక్రాంతి వచ్చిందంటే పండగ ముందు పండగ తర్వాత గాలిపటాలు ఎగురవేస్తూ స్నేహితులతో, కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపే వారమని, నేటితరం సెల్ ఫోన్, సోషల్ మీడియా మాయలో పడి మన సంస్కృతి సాంప్రదాయాలను మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని కాపాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కైట్ ఫెస్టివల్ సందర్భంగా ఏర్పాటు చేసిన డీజే పాటలకు ఎమ్మెల్యే స్టెప్పులేసి ఆకట్టుకున్నారు. రంగోలి, కైట్ కార్యక్రమం లో పాల్గొని విజేతలు గా నిలిచిన వారికి ఎం డి ఆర్ ఫౌండేషన్ వారు విలువైన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, ఎం.డి.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పృధ్వీరాజ్, పఠాన్ చెరు నియోజకవర్గ బి ఆర్ ఎస్ పార్టీ కన్వీనర్ వి. ఆదర్శ్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పట్టణ పుర ప్రముఖులు, సీనియర్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ గోదాదేవి రంగనాయక స్వామి కళ్యాణం

ప్రతిపక్షం,మొయినాబాద్, జనవరి 14: మున్సిపాలిటీ పరిధిలోని చిల్కూర్ బాలాజీ దేవాలయంలో శ్రీ గోదాదేవి, రంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా వేదపండితులు, ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్ ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ పట్నం సునితామహేందర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పూలు, పండ్లు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలని తెలిపారు. అదేవిదంగా ఆలయ అర్చకులు సునితామహేందర్ రెడ్డికి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయంలో సందడి నెలకొంది.

సిద్దిపేటలో భోగి సంబరాలు

సిద్దిపేట పట్టణంలోని రాఘవేంద్ర నగర్ వీధి నెంబర్–2 లో భోగి పండుగను అంగరంగవైభవంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. భోగి పండుగ మనలోని చెడును కాల్చివేయాలనే సందేశాన్ని ఇస్తుందని, మనసులోని ద్వేషాన్ని తొలగించి ప్రేమాభిమానాలు పెంపొందించుకోవాలని కాలనీ పెద్దలు తెలిపారు. భోగి సంబరాలు కాలనీలో ఆనందోత్సాహాలతో కొనసాగాయి.

అయ్యప్ప మాలధారణతో మానసిక ప్రశాంతత

- **టీజీఐఐసీ చెర్మెన్ నిర్మల జగ్గారెడ్డి, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**
- **అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు**

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, జనవరి 14 : తెలంగాణలో సదాశివపేట పట్టణం ఆధ్యాత్మిక భక్తికి కేంద్రలుగా నిలుస్తయని స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టిజిఐసిసి చెర్మెన్ నిర్మల జగ్గారెడ్డి లు అన్నారు. బుధవారం సంగారెడ్డి సదాశివపేట పట్టణల ల్లో అయ్యప్ప ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా అయ్యప్ప స్వామి పవిత్ర స్వర్ణ ఆభరణాల ఊరేగింపు భక్తిశ్రద్ధల తో ఘనంగా నిర్వహించారు. భక్తి, సంప్రదాయం, సాంస్కృతిక సమైక్యతను ప్రతిబింబించేలా ఈ కార్యక్రమం అత్యంత ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆభరణాల ఊరేగింపు కేవలం మతపరమైన కార్యక్రమమే కాకుండా, లోతైన ఆధ్యాత్మిక విశ్వాసం మరియు సామాజిక ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. భక్తులు 41 రోజుల కఠిన ప్రతాన్ని నియమ నిష్ఠలతో ఆచరిస్తూ ఆత్మనియంత్రణ, నైతిక విలువలను అలవరుచుకుంటారని తెలిపారు. సంగమేశ్వర ఆలయం నుంచి అయ్యప్ప ఆలయం వరకు సాగిన ఊరేగింపు అంతటా భజనలు, కీర్తనలు, "స్వామియే శరణం అయ్యప్ప" నినాదాలతో పట్టణలు ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగయన్నారు. అయ్యప్ప స్వామి దివ్య స్వర్ణ ఆభరణాలు ప్రధాన ఆకర్షణగా నిలిచి, సమానత్వం, భక్తి, అంతర్ముఖ శుద్ధిని మరింత బలపరిచాయని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధులు, గురుస్వాములు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అయ్యప్ప భక్తులు ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా పెద్ద సంఖ్యలో పాల్గొనడం ద్వారా అయ్యప్ప స్వామి సందేశానికి సజీవ సాక్ష్యంగా నిలిచారని తెలిపారు. ఈ ఊరేగింపు భక్తి, సంప్రదాయం, సామాజిక సామరస్యాన్ని ప్రతిబింబించే మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిగా ముగిసింది. ఈ కార్యక్రమం లో పట్టణ రాజకీయ పార్టీ ల నాయకులు అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా సంక్రాంతి సంబురాలు

ప్రతిపక్షం,రాయపోల్, జనవరి 14. సంక్రాంతి పండుగ సందర్భంగా సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా గెలుపొందిన సర్పంచులు ఆయా గ్రామాల్లో మహిళలకు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగానే మండల పరిధిలోని తిమ్మక్కపల్లి. అనాజీపూర్. వీరారె రెడ్డి పల్లి తో పాటు తదిర గ్రామాల్లో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఉదయం మహిళలు రంగురంగుల ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. సందర్భంగా ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానం అందజేశారు. కాగా తిమ్మకపల్లి గ్రామంలో సర్పంచ్ సత్తు అశోక్ రెడ్డి. గ్రామ యువత నాయకులు యాదగిరి తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సంక్రాంతి ముగ్గుల పోటీల సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో తొగుట సీఐ షేక్ లతీఫ్ ముఖ్యఅతిథిగా హాజరై గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సంస్కృతి సాంప్రదాయాలు పరిరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల యువకులు నాయకులు తదితరు పాల్గొన్నారు.

జర్నలిస్టులు శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

- **17వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలి**
- **23, 24 తేదీల్లో హైదరాబాదులో శిక్షణ**
- **టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు గార్లపాటి పిలుపు**

ప్రతిపక్షం, చిట్యాల, జనవరి 14: ఈనెల 23, 24వ తేదీల్లో హైదరాబాదులోని నాంపల్లి లో ఉన్న మీడియా అకాడమీ ఆడిటోరియంలో జరగనున్న జర్నలిస్టుల శిక్షణా తరగతులను జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నల్గొండ జిల్లా అధ్యక్షులు గార్లపాటి కృష్ణారెడ్డి కోరారు. శిక్షణ తరగతులను దృష్టిలో ఉంచుకొని బుధవారం జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించారు. అనంతరం చిట్యాల లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ మీడియా అకాడమీ, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంయుక్తంగా నిర్వహించే ఈ శిక్షణ తరగతులకు సంబంధించి ఆసక్తి ఉన్న జర్నలిస్టులు ఈనెల 17వ తేదీలోగా జిల్లా కమిటీకి తమ పేర్లను అందజేయాలని తెలిపారు. జర్నలిజంలో వృత్తిపరంగా ఎంతో నైపుణ్యం కోసం అందజేస్తున్న ఈ శిక్షణ జర్నలిస్టులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం అభివృద్ధి కోసం కృషి చేస్తూనే, వృత్తిపరంగా మెలకువలు నేర్పించడం కోసం శిక్షణ తరగతులు ఏర్పాటుచేసిన మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి అక్రిడేషన్ తో పాటు ఇంటి స్థలం, ఇల్లు, హెల్త్ కార్డులు అందించడం కోసం జిల్లా కమిటీ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు పులిమామిడి మహేందర్ రెడ్డి, దోటి శ్రీనివాస్, యేళ్ల బయన్న, మెండె వెంకన్న, పోకల కరుణాకర్, చెరుపల్లి శ్రీనివాస్, మిర్యాల ప్రకాశ్, అమరోజు వెంకన్న పాల్గొన్నారు.

చైనా మాంజా అమ్ముతున్న వ్యక్తులపై హత్యాయత్నం కేసు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 14 : ప్రభుత్వం నిషేధించిన చైనీస్ మాంజ అమ్ముతున్న ముగ్గురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఆర్మూర్ ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఆర్మూర్ పట్టణంలో నమ్మదగిన సమాచారం మేరకు ప్రభుత్వం నిషేధించిన చైనీస్ మాంజ అమ్ముతున్న రన్నా పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు సాయి కృష్ణ షాపు ను పోలీసులు తనిఖీ చేయగా చేయగా షాపులో 19 చైనా మాంజా బండిల్స్ దొరికాయి. చైనా మాంజా 19 బాండిల్స్ లను స్వాధీనం చేసుకొని షాప్ యజమాని నారాయణ, రవిలను అదుపులోకి తీసుకొని విచారించగా తాను నిజామాబాద్ లో హోల్సేల్ గా అమ్ముతున్న జహీర్ ఖాన్ అనే వ్యక్తి నుండి కొని తెచ్చినట్లు చెప్పగా పోలీసులు జహీర్ ఖాన్ ను పట్టుకుని ముగ్గురిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ హెచ్ ఓ సత్యనారాయణ గౌడ్ తెలిపారు.

బీఆర్ఎస్, కేసీఆర్‌ను విమర్శించాల్సిన అవసరం తమకు లేదు. బీఆర్ఎస్, కేసీఆర్‌ను తిట్టేందుకు ఆయన కుమార్తె కవిత చాలు. కేసీఆర్7లక్షల కోట్ల అప్పు చేస్తే వాటిని చెల్లిస్తూ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. బంగారు తెలంగాణ చేశామని చెప్పిన కేసీఆర్అధికారం కోల్పోయిన 6 నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు వస్తే ఒక్క సీటూ సాధించలేదు. ఆ పార్టీ గురించి ప్రజలు చూసుకుంటారు.

\- మంత్రి
కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రాంతీయం

రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు సంజీవని వంటి రాయలసీమ లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టును తిరిగి ప్రారంభించాల్సిందే. తెలంగాణ సీఎం రేవంత్‌తో చేసుకున్న ఒప్పందాన్ని చంద్రబాబు రద్దు చేసుకోవాలి. క్లోజ్డ్‌డోర్ భేటీలో జరిగిన ఈ ఒప్పందంపై రేవంత్ మాటల్ని చంద్రబాబు ఖండించకపోగా, ఏవేవో చెబుతూ మభ్యపెడుతున్నారు. ప్రాజెక్టు కోసం ఉద్యమిస్తాం.

- వైసీపీ నేత కాకాణి గోవర్ధన్ రెడ్డి

మీడియా గొంతు నొక్కేందుకు రేవంత్ రెడ్డి ప్రయత్నం

- మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్

ప్రతిపక్షం ప్రతినిధి, సంగారెడ్డి, జనవరి 14: జర్నలిస్టుల అక్రమ అరెస్టులతో నియంతృత్వ పాలన చూపిస్తున్న రేవంత్ రెడ్డి అని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ఫైర్ అయ్యారు. జహీరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ, జర్నలిస్టుల అక్రమ అరెస్టుల ద్వారా మీడియా గొంతు నొక్కేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. జర్నలిస్టులేమైనా టెర్రరిస్టులా? అర్ధరాత్రి తలుపులు బద్దలు కొట్టి అరెస్టులు చేయడం దుర్మార్గమని విమర్శించారు. హోంశాఖను అడ్డుపెట్టుకుని పోలీసులను తన ప్రైవేట్ సైన్యంలా వాడుకుంటున్నారని, కమిషనర్ సజ్జనార్ కాంగ్రెస్ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దళిత జర్నలిస్టుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టేందుకు ప్రయత్నించడం రేవంత్ రెడ్డి వికృత రాజకీయానికి నిదర్శనమన్నారు. అనుమానం ఉన్నవారికి నోటీసులు ఇచ్చి విచారణ చేయవచ్చని, కానీ పండుగ పూట అర్ధరాత్రి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియాను బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, రేవంత్ రెడ్డి పాలన ఎమర్జెన్సీని తలపిస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు బెదిరింపులకు పాల్పడినా కేసులు నమోదు చేయడం లేదని, ప్రశ్నించే గొంతులపై మాత్రమే పోలీసు చర్యలు ఉంటున్నాయని ఆరోపించారు. జర్నలిస్టులపై అక్రమ కేసులు, ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయిస్తే బీఆర్ఎస్ పార్టీ ఊరుకోదని స్పష్టం చేస్తూ, జర్నలిస్టుల పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని హరీష్‌రావు ప్రకటించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు మాణిక్ రావు, చింత ప్రభాకర్ పాల్గొన్నారు.

గాలిపటాలు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి

- కరెంట్ వైర్లు, విద్యుత్ స్తంభాల వద్ద జాగ్రత్త
- మెదక్ జిల్లా ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు
- మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 14 : మెదక్ జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండుగ సందర్భంగా గాలిపటాలు ఎగురవేసే సమయంలో ప్రజలంతా అవసరమైన అన్ని రకాల జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు సూచించారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను పురస్కరించుకొని జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు మరియు సిబ్బందికి ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ అంటే గాలిపటాల సంబరమని, అయితే ఆనందంతో పాటు భద్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. గాలిపటాలు ఎగురవేసే సమయంలో కరెంట్ వైర్లు, విద్యుత్ స్తంభాలు, చెట్ల కొమ్మలు, బిల్డింగ్‌లపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా భవనాల పైకప్పులపై గాలిపటాలు ఎగురవేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, చిన్నపిల్లలను పెద్దల పర్యవేక్షణలోనే గాలిపటాలు ఎగురవేయాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం నిషేధించిన చైనా మాంజా (నైలాన్ దారం) విక్రయం, వినియోగం ప్రాణాంతకంగా మారుతుందని పేర్కొన్నారు. చైనా మాంజా వల్ల మనుషులకు, పక్షులకు తీవ్ర గాయాలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో జిల్లాలో చైనా మాంజా విక్రయాలు లేదా వినియోగం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెట్ల కొమ్మలు లేదా కరెంట్ స్తంభాలకు చిక్కుకున్న గాలిపటాలను తీసేందుకు ప్రయత్నించడం ప్రమాదకరమని, అలాంటి సందర్భాల్లో విద్యుత్ శాఖ లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జిల్లా ప్రజలందరికీ భోగి, సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, పండుగను సురక్షితంగా, ఆనందంగా జరుపుకోవాలని కోరారు.

వార్డ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, జనవరి 14 : పోలింగ్ కేంద్రాల్లాలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు.జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి పదో వార్డు పోలింగ్ కేంద్రాలను బుధవారం కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.పోలింగ్ కేంద్రాలను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేయాలని . పోలింగ్ స్టేషన్ డిస్టెన్స్ తాగునీటి సౌకర్యం, ర్యాంపులు ఎండేలా చూసుకోవాలన్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడింది మొదలుకొని.. ప్రక్రియ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా వ్యవహరించాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు ఇచ్చి దొంగతనానికి పాల్పడిన ముఠా గుట్టురట్టు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, జనవరి 14 : మత్తు పదార్థాలు ఇచ్చి దొంగతనానికి పాల్పడిన ముఠాను పట్టుకున్నట్లు నిజామాబాద్ నాలుగవ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ సతీష్ కుమార్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాస్ అనే వ్యక్తి కి బాత ప్రసాదం, నర్సింగారావు, రుద్రా యాదవ్ లు రైస్ వ్యాపారం గురించి మాయ మాటలు చెప్పి, నగరం లోని వంశీ ఇంటర్నేషనల్ కు తీసుకు వచ్చి హోటల్ లో తాగే బీరులో మత్తు గోలీలు కలిపి తాగిపించి అతని వద్ద నుండి రెండు బంగారు ఉంగరాలు గోల్డ్ చైన్ కొంత నగదు దొంగిలించుకు పోయారు. అనంతరం బాధితుడు శ్రీనివాస్ ఇట్టి విషయంపై నాల్గో టౌన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి నిందితులను పట్టుకొని విచారించగా చేసిన నేరం ఒప్పుకున్నారు. వారి నుండి కొంత నగదును సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తాము దొంగిలించిన సొమ్మును హైదరాబాద్ కు చెందిన శ్రీనివాస్ గుప్తా వద్ద తాకట్టు పెట్టినట్లు పోలీసులకు వెల్లడించారు. గతంలో కూడా నేరస్తులు ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ లలో పలు నేరాలకు పాల్పడినట్లు విచారణలో తేలింది. కావున ప్రజలు ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు ఏదైనా వ్యాపారం గురించి మాయమాటలు చెప్పి నమ్మించి వారు ఇచ్చే డ్రింకులను తాగకుండా, తమ సొమ్ము పోగొట్టుకోకుండా ఉండాలని పోలీసు కోరారు. ఈ సమావేశంలో ఎస్సై ఉదయ్ కుమార్, ఎస్సై సందీప్ కుమార్, కేసులో చాకచక్యంగా పని చేసిన పోలీస్ కానిస్టేబుల్లు అయిన, షేకర్, రమేష్, సనగేష్, ఏఎస్సై రవిందర్ సిబ్బందిని అబినందించారు.

హుస్నాబాద్‌ను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తాం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- ఎల్లమ్మ చెరువు వద్ద సంక్రాంతి సందడి

ప్రతిపక్షం ప్రతినిధి, హుస్నాబాద్, జనవరి 14: హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద నిర్వహించిన కైట్ ఫెస్టివల్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో కలిసి గాలి పటాలను ఎగురవేశారు. రంగురంగుల గాలిపటాలతో ఎల్లమ్మ చెరువు ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రజలకు భోగి, మకర సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

వచ్చే ఏడాది లోపు హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువును టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే వచ్చే సంక్రాంతికి ఇక్కడే కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించుకుందామని సూచించారు. మహా సముద్రం గండి, సర్దార్ పాపన్న గుట్టలు, భైరవ స్వామి గుడి, అర్బన్ పార్క్, రాయికల్ వాటర్ ఫాల్స్, ఎల్లమ్మ చెరువు, ఎల్లమ్మ ఆలయం, పొట్లపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయం, కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయం, గౌరవెల్లి గండిపల్లి ప్రాజెక్ట్ వంటి ప్రాంతాలతో హుస్నాబాద్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.

మత్స్య సంపదతో ఉపాధి పెంపే లక్ష్యం

మత్స్య సంపద ద్వారా గ్రామీణ ఉపాధి అవకాశాలు పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని శనిగరం చెరువులో మత్స్య అభివృద్ధి మరియు స్టేట్ సెక్టార్ పథకం కింద 100 శాతం రాయితీపై రొయ్య పిల్లలను మంత్రి పొన్నం ప్రభాకర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, కోహెడ మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్, శనిగరం సర్పంచ్ లింగంపల్లి లక్ష్మీనారాయణ, మత్స్య సహకార సంఘాల నాయకులు, అధికారులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ నియోజకవర్గంలోని 166 చెరువులకు గాను 38 లక్షల 92 వేల చేప పిల్లలు విడుదల చేయడానికి ప్రణాళికలు రూపొందించగా, ఇప్పటి వరకు 26 చెరువుల్లో 26 లక్షల 69 వేల 860 చేప పిల్లలను విడుదల చేశారు. ఇందుకు గాను రూ.46.08 లక్షల వ్యయం జరిగింది. అలాగే రెండు చెరువుల్లో 5 లక్షల రొయ్య పిల్లలను విడుదల చేయడానికి రూ.13.58 లక్షల వ్యయంతో ప్రణాళిక సిద్ధం చేశారు. శనిగరం రిజర్వాయర్‌లో మొత్తం 9.87 లక్షల చేప పిల్లల విడుదలకు ప్రభుత్వం రూ.17.04 లక్షలు ఖర్చు చేయగా, ఈ ఏడాది 4 లక్షల రొయ్య పిల్లల విడుదలకు రూ.10.84 లక్షలు వెచ్చించింది. చేపలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని, చెరువుల్లో చేప పిల్లలు, రొయ్యలను ప్రభుత్వం ఉచితంగా విడుదల చేస్తోందన్నారు.

జర్నలిస్టుల అరెస్టును ఖండించిన టీయూడబ్ల్యూజే

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట జనవరి 14: ఎన్టీవీలో ప్రసారమైన ఒక వార్తకు బాధ్యులని జర్నలిస్టులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సిద్దిపేట జిల్లా శాఖ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు సంఘం బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్టీవీ ఇన్‌పుట్ ఎడిటర్ దొంతు రమేశ్, సీనియర్ జర్నలిస్టులు పరిపూర్ణాచారి, సుధీర్‌తో పాటు ఒక మహిళా జర్నలిస్టును అక్రమంగా అరెస్ట్ చేయడం అప్రజాస్వామిక చర్య అని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు కలకుంట్ల రంగాచారి అన్నారు.. ఒక వార్తపై అభ్యంతరం ఉంటే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లేదా ఇతర ప్రజాస్వామ్య మార్గాలను ఆశ్రయించాలని సూచించారు. వార్త ప్రసారం చేసిన ఎన్టీవీ యాజమాన్యం, ఎడిటర్ ఇప్పటికే క్షమాపణ చెప్పినప్పటికీ జర్నలిస్టులను అరెస్ట్ చేయడం పోలీసుల దౌర్జన్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. అరెస్ట్ చేసిన జర్నలిస్టులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, వారిపై నమోదు చేసిన కేసులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి కళ్యాణం

ప్రతిపక్షం, చేగుంట, జనవరి 14: చేగుంట మండల కేంద్రంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోదాదేవి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వాసుదేవా ఆచార్యులు తోటి అర్చకులు శ్రీనివాస్ తదితరులతో వేద మంత్రోత్సవాల మధ్య కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కీర్తిశేషులు బచ్చు రాజయ్య కుమారులు సుదర్శన్ (సురేష్) ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. కళ్యాణోత్సవంలో సురేష్ దంపతులు విజయ రాఘవ రమేష్ మహేష్ శ్రీనివాస్ చందు దంపతులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కళ్యాణోత్సవం అనంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఒక్క రోడ్డు ప్రమాదం కుటుంబాన్ని చిన్నాభిన్నం చేస్తుంది

- గజ్వేల్ ఏసీపీ నరసింహులు

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 14: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రోడ్ సేఫ్టీ ప్రోగ్రాం లో భాగంగా గజ్వేల్ ఏసీబీ నరసింహులు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ మురళి, గజ్వేల్ ఇన్స్పెక్టర్ రవికుమార్ మండలంలోని రిమ్మనగూడ గ్రామంలో రోడ్ సేఫ్టీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఏసిపి నరసింహులు మాట్లాడుతూ వాహనాలు దారులు అందరు కచ్చితంగా హెల్మెట్, బెల్ట్ ధరించవలెనని అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని, మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుపడితే పదివేల రూపాయల జరిమాన, జైలు శిక్ష కూడా విధించబడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్థోపెడిక్ డాక్టర్ చైతన్య, గ్రామ సర్పంచ్ కరుణాకర్, ఉప సర్పంచ్ మరియు ప్రజా ప్రతినిధులు ప్రజలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట పట్టణంలోని 16 వ వార్డులో కౌన్సిలర్ బర్ల మల్లికార్జున్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. భోగి మంటలు, గంగిరెద్దులతో సందడి నెలకొంది. -ప్రతిపక్షం, సిద్దిపేట

బీఆర్ఎస్ పార్టీలోకి వలసలు

ప్రతిపక్షం, గజ్వేల్, జనవరి 14: మాజీ మంత్రి సిద్దిపేట శాసనసభ్యులు హరీష్‌రావు సమక్షంలో కోకాపేట హరీష్ రావు నివాసం వద్ద గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో తూప్రాన్ మండలంలోని ఇస్లాంపూర్ గ్రామం మరియు వెంకట రత్నాపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బిజెపి నాయకులు కార్యకర్తలు నరేందర్ రెడ్డి, రామలింగారెడ్డి, నాగులపల్లి సిద్దిరాం రెడ్డి, బెస్త విజయ్, సాకలి భూషణ్, లక్ష్మణ్, కుమ్మరి మహేష్, కుమ్మరి సత్యనారాయణ, శ్రీకాంత్, నరేష్, కురుమ శ్రీశైలం, సంజీవులు, లంబడి శంకర్, సార్థకాల రామచందర్, నరసింహులు, భీమ్లా, బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది. వారికి గులాబీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మాజీ జెడ్పిటిసి సత్యనారాయణ గౌడ్, తూప్రాన్ మాజీ మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్, వెంకటరత్నాపూర్ మాజీ సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, మహేందర్ రెడ్డి, ఇస్లాంపూర్ మాజీ సర్పంచ్ రమేష్, వెంకటరత్నాపూర్ ఉపసర్పంచ్ మహేష్, ఇస్లాంపూర్ వార్డ్ సభ్యుడు శ్రీశైలం, మాజీ ఉపసర్పంచ్ నాగేష్, బి నరేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్ని అంటిన భోగి, సంక్రాంతి సంబరాలు

- ఎస్పీ రాజేష్ చంద్ర ఆధ్వర్యంలో 'కైట్ ఫ్లయింగ్ ఫెస్టివల్' నిర్వహణ

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, జనవరి 14: భోగి సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయ మైదానంలో పండుగ వాతావరణం నెలకొంది. జిల్లా ఎస్పీ యం. రాజేష్‌చంద్ర ఆధ్వర్యంలో "కైట్ ఫ్లయింగ్ ఫెస్టివల్" (పతంగుల పండుగ) ను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొని సందడి చేశారు. కార్యక్రమం ప్రారంభంలో జిల్లా ఎస్పీ సంప్రదాయబద్ధంగా భోగి మంటను వెలిగించి, జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మైదానంలో ఏర్పాటు చేసిన పతంగుల పండుగలో జిల్లా అడిషనల్ ఎస్పీ, కామారెడ్డి ఏఎస్పీ, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అందరూ కలిసి రంగురంగుల పతంగులను ఎగురవేస్తూ ఆనందోత్సాహాల మధ్య సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని, ఇలాంటి వేడుకలు పోలీస్ కుటుంబాల మధ్య ఐక్యతను, పరస్పర స్నేహాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. నిరంతరం విధుల్లో నిమగ్నమయ్యే పోలీస్ సిబ్బందికి ఈ తరహా కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని, కొత్త ఉత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. అదేవిధంగా పతంగులు ఎగురవేసే సమయంలో చైనీస్ మాంజా లేదా నైలాన్ మాంజా వాడకూడదని స్పష్టం చేశారు. అవి పక్షులకు మాత్రమే కాకుండా, వాహనదారుల ప్రాణాలకు కూడా తీవ్రమైన ముప్పుగా మారతాయని హెచ్చరించారు. ప్రజలంతా కేవలం కాటన్ థ్రెడ్ (నూలు దారం) మాత్రమే ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. పండుగలు ఆనందాన్ని పంచాలి గానీ విషాదాన్ని మిగల్చకూడదని, సంప్రదాయాలను గౌరవిస్తూ భద్రతా నియమాలను పాటించాలన్నారు. ప్రతి కుటుంబం సురక్షితంగా, ఆనందంగా ఉండాలన్నదే పోలీస్ శాఖ సంకల్పమని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నరసింహ రెడ్డి, కామారెడ్డి ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, ఆర్ఐలు సంతోష్ కుమార్, కృష్ణ, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వ వీక్షణం

మా పెత్తనం ఉండాల్సిందే!

- గ్రీన్ లాండ్ పై ట్రంప్ కీలక వ్యాఖ్యలు

భద్రత పరంగా, నాటో శక్తిని మరింత బలోపేతం చేయాలంటే గ్రీన్‌ల్యాండ్ అమెరికా ఆధీనంలో ఉండాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. గ్రీన్‌లాండ్ దక్కించుకునే విషయంపై ట్రంప్ మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. డెన్మార్క్ స్వయం ప్రతిపత్తి కలిగిన భూభాగమైన గ్రీన్‌లాండ్‌ను తమ నియంత్రణలో ఉండాల్సిందే అని, లేకపోతే ఒప్పుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ మేరకు ఆయన బుధవారం తన సోషల్ మీడియాలో ట్రూత్ సోషల్ వేదికగా వెల్లడించారు. పెంటగాన్ అభివృద్ధి చేస్తున్న 'గోల్డెన్ డోమ్' క్షిపణి రక్షణ వ్యవస్థకు గ్రీన్‌ల్యాండ్ వ్యూహాత్మకంగా ఎంతో అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పుడు గ్రీన్‌లాండ్‌ను దక్కించుకోకపోతే రష్యా, చైనా గ్రీన్‌ల్యాండ్‌ను ఆ పని చేస్తాయని ట్రంప్ హెచ్చరించారు. అలాగే, నాటో, అమెరికా సైనిక శక్తుల గురించి కూడా ట్రంప్ స్పందించారు. నాటో కూటమి మనుగడ అమెరికా సైనిక శక్తిపైనే ఆధారపడి ఉందని, కాబట్టి గ్రీన్‌లాండ్ విషయంలో తమ మాటను గౌరవించాలని ట్రంప్ సూచించారు. లీజుకు తీసుకోవడం లేదా ఒప్పందాలు చేసుకోవడం కాకుండా గ్రీన్‌లాండ్ పూర్తిగా అమెరికా చేతుల్లోనే ఉండాలని, అంతకంటే తక్కువ స్థాయి రాజీలకు తాము ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. గ్రీన్‌లాండ్ ప్రస్తుతం డెన్మార్క్ దేశం కింద స్వయంప్రతిపత్తి కలిగిన భూభాగంగా ఉంది. ట్రంప్ వ్యాఖ్యలపై యూరోప్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ మాట్లాడుతూ, డెన్మార్క్‌కు చెందిన భూభాగంపై అమెరికా ఆధిపత్య ప్రయత్నం చేస్తే, దాని ప్రభావం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. డెన్మార్క్ సార్వభౌమాధికారానికి తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. మరోవైపు ట్రంప్ వ్యాఖ్యల నేపథ్యంలో డెన్మార్క్ కూడా అప్రమత్తమైనట్లు ఆ దేశ ప్రభుత్వ మీడియా సంస్థ 'డీఆర్' పేర్కొంది.

థాయిలాండ్ లో ఘోరం..

- రైలుపై కుప్పకూలిన క్రేన్.. 22 మంది దుర్మరణం

థాయ్‌లాండ్‌లో ఘోర రైలు ప్రమాదం చోటు చేసుకుంది. రైలుపై క్రేన్ కూలి పడటంతో అది పట్టాలు తప్పింది. ఈ ఘటనలో దాదాపు 22 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది. కాగా 30 మందికి పైగా తీవ్ర గాయపడ్డారు. ఈ ఘటన బ్యాంకాక్‌కు 230 కిలోమీటర్ల దూరంలో ఉన్న నఖోన్ రచ్చసీమ ప్రావిన్స్‌లోని సిఖియో జిల్లాలో బుధవారం ఉదయం జరిగింది. ప్రమాద వివరాలను స్థానిక పోలీసు చీఫ్ థాచ్‌పోన్ చిన్నవాంగ్ వెల్లడించారు. 'ఇప్పటివరకు 22 మంది మృతి చెందారు. గాయపడిన వారి సంఖ్య 30కు మించవచ్చు' అని ఆయన తెలిపారు. హైస్పీడ్ రైలు ప్రాజెక్టులో భాగంగా పని చేస్తున్న నిర్మాణ క్రేన్ ఒక్కసారిగా కూలి రైలు బోగీపై పడటంతో రైలు పట్టాలు తప్పింది. ఈ ఘటనలో ఒక బోగీలో స్వల్పంగా మంటలు చెలరేగినట్లు స్థానిక మీడియా పేర్కొంది. ప్రమాదం జరిగిన సమయంలో రైలులో 150 మంది ప్రయాణికులు ఉన్నట్లు సమాచారం. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

ఇందులో విచారణ చేయడానికి ఏం లేదు!!

- ఐప్యాక్ కార్యాలయంలో ఈడీ సోదాలపై
- తృణమూల్ పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, కోల్ కత, జనవరి 14: ఐ ప్యాక్ డైరెక్టర్ ప్రతీక్ జైన్ కార్యాలయం, నివాసంలో ఈడీ దాడులకు సంబంధించి టీఎంసీ దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం కోల్ కత హైకోర్టు కొట్టివేసింది. జనవరి 8న ఐ ప్యాక్ కార్యాలయం, ప్రతీక్ జైన్ నివాసంలో ఈడీ సోదాలు నిర్వహించిన సమయంలో, వ్యక్తిగత, రాజకీయ సమాచారాన్ని స్వాధీనం చేసుకుని ఉండవచ్చునని టీఎంసీ అనుమానం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో, ఆ డేటాను సంరక్షించాలంటూ కోర్టు ఆదేశాలు ఇవ్వాలని టీఎంసీ హైకోర్టును ఆశ్రయించింది. అయితే, ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు, ఈ రెండు ప్రదేశాల నుంచి ఏమీ స్వాధీనం చేసుకోలేదని కోర్టుకు స్పష్టం చేశారు. ఈడీ స్వాధీనం చేసుకున్నదేమైనా ఉంటే, అది ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీసుకెళ్లారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఈడీ, కేంద్ర ప్రభుత్వం తరఫున చేసిన వాదనలను పరిగణనలోకి తీసుకున్న జస్టిస్ సువ్రా ఘోశ్, ఈ వ్యవహారంలో తదుపరి విచారించాల్సిన అవసరం ఏమీ లేదని వ్యాఖ్యానిస్తూ, టీఎంసీ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు. జనవరి 8న సాల్ట్‌లేక్‌లోని రాజకీయ కన్సల్టెన్సీ సంస్థ కార్యాలయం, దక్షిణ కోల్‌కతాలోని లౌడన్ స్ట్రీట్‌లో ఉన్న ప్రతీక్ జైన్ నివాసానికి మమతా బెనర్జీ వెళ్లిన ఘటనపై సీబీఐ విచారణ కోరుతూ ఈడీ దాఖలు చేసిన మరో పిటిషన్‌ను హైకోర్టు వాయిదా వేసింది. ఈడీ ఇప్పటికే దాదాపు ఇదే అంశాలపై సుప్రీంకోర్టులో రెండు ప్రత్యేక పిటిషన్లు దాఖలు చేసినందున, దానిపై మళ్లీ విచారణ చేపట్టడం సరికాదని కోర్టు అభిప్రాయపడింది. ఈడీ తరఫు న్యాయవాది వాదిస్తూ, అదే అంశం సుప్రీంకోర్టులో విచారణలో ఉండగా, హైకోర్టు జోక్యం చేసుకోకూడదని పేర్కొన్నారు. మరోవైపు, టీఎంసీ తరఫు న్యాయవాది మేనకా గురుస్వామి, రాజకీయ పార్టీలకూ గోప్యత హక్కు ఉందని, సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇప్పటికే స్పష్టం చేసిందని కోర్టుకు వివరించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో టీఎంసీకి సంబంధించిన సున్నితమైన డేటాను స్వాధీనం చేసుకునేందుకు దర్యాప్తు సంస్థలు ప్రయత్నిస్తున్నాయంటూ ఆమె ఆరోపించారు.



వెంటనే ఇరాన్ విడిచి వచ్చేయండి

- భారతీయులకు విదేశాంగ శాఖ అడ్వయిజరీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, జనవరి 14 : ఇరాన్‌లో చెలరేగిన అల్లర్లు తీవ్ర రూపం దాల్చడంతో భారత్ అప్రమత్తమైంది. ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయులు వెంటనే ఆ దేశాన్ని విడిచి తిరిగి స్వదేశానికి రావాలని ఆదేశించింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ అత్యవసర అడ్వైజరీ జారీ చేసింది. తాజా పరిణామాల దృష్ట్యా ఇరాన్‌కు ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. భారత పౌరులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను వీడాలని పేర్కొంది. ప్రయాణానికి అవసరమైన పాస్‌పోర్ట్, ఐడీ కార్డు, ఇతర ఇమ్మిగ్రేషన్ పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపింది. ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు, భారత సంతతికి చెందిన వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వెల్లడించింది. నిరసన ప్రదర్శనలు జరిగే ప్రాంతాలకు దూరంగా ఉండాలని తెలిపింది. ఎలాంటి సహాయం కావాలన్న టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయాన్ని సంప్రదించాలని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇరాన్‌లో చెలరేగిన ఆందోళనలు హింసాత్మకంగా మారడంతో ఈ నెల 5న భారత విదేశాంగశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే పరిస్థితులు చేయి దాటిపోతుండటంతో అక్కడ నివసిస్తున్న భారతీయులకు విదేశాంగ శాఖ మరోసారి అడ్వైజరీ జారీ చేసింది. ఇరాన్ కరెన్సీ రియాల్ రికార్డు స్థాయిలో పడిపోవడంతో గతేడాది డిసెంబర్‌లో టెహ్రాన్‌లో నిరసనలు ప్రారంభమయ్యాయి. ఆర్థిక ఇబ్బందులకు వ్యతిరేకంగా నిరసనకారులు ఆందోళన చేపట్టారు. అయితే, బుధవారం నాటికి ఈ నిరసనలు పూర్తిగా దిగజారిపోయాయి. దేశవ్యాప్తంగా మృతుల సంఖ్య 2,500 కంటే ఎక్కువగా ఉందని అమెరికాకు చెందిన మానవ హక్కుల కార్యకర్తల వార్తా సంస్థ పేర్కొంది. ఈ నిరసనల నేపథ్యంలో ఇరాన్‌లో చదువుకుంటున్న డజన్ల కొద్దీ పాకిస్థాన్ విద్యార్థులు తిరిగి స్వదేశానికి చేరుకున్నట్లు పాక్ ఇమ్మిగ్రేషన్ అధికారి తెలిపారు.

లింఫోమా అంటే ఏంటి?

ఇది ఎందుకు వస్తుంది? దీనికి చికిత్స ఉందా?

డా. కౌశల్ గోవర్ధన
7702417779
వైస్ చైర్మన్, శ్రీ రామానుజ సేవా ట్రస్ట్
ధనుంజయ నర్సింగ్ హోమ్, హైదరాబాద్

లింఫోమా.. ఒక రకమైన రక్త క్యాన్సర్. నేరుగా శోషరస గ్రంథుల వ్యవస్థ మీద ప్రభావం చూపుతుంది. శరీరంలో శోషరస గ్రంథుల పాత్ర చాలా ప్రధానమైంది. వివిధ ఇన్‌ఫెక్షన్లకు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడే బాధ్యత వీటిదే. శోషరస గ్రంథులు, శోషరస నాళం, ప్లీహం, అస్థిమజ్జ మొదలైన భాగాలకు .. శోషరస వ్యవస్థే రక్షణ కవచం. ఒక రకమైన కణాలైన లింఫోసైట్లు అసాధారణంగా పెరిగిపోవడం వల్ల ఆయా భాగాల్లో కణుతులు ఏర్పడి.. లింఫోమాకు దారితీస్తుంది. దురదృష్టవశాత్తు ఈ క్యాన్సర్ గురించి ప్రజల్లో అవగాహన తక్కువే. కానీ వ్యాధి తీవ్రత చాలా ఎక్కువ. లింఫోమా అనేది రోగనిరోధక వ్యవస్థలోని తెల్ల రక్త కణాలైన లింఫోసైట్లులో ప్రారంభమయ్యే ఒక రకమైన రక్త క్యాన్సర్, ఇది శోషరస వ్యవస్థ (lymphatic system)కు సోకుతుంది, దీనిలో ప్రధానంగా రెండు రకాలు: హాడ్కిన్ లింఫోమా (Hodgkin lymphoma) మరియు నాన్‌హాడ్కిన్ లింఫోమా (NonHodgkin lymphoma) ఉంటాయి. దీని లక్షణాలలో మెడ, చంకలు, గజ్జల్లో నొప్పి లేని వాపు, అలసట, జ్వరం, రాత్రి చెమటలు, మరియు బరువు తగ్గడం వంటివి ఉంటాయి, మరియు ప్రారంభ దశలో గుర్తిస్తే దీనికి చికిత్స సాధ్యమవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ప్రాణాలను కబళిస్తున్న క్యాన్సర్లలో లింఫోమా ఆరో స్థానంలో ఉంది. ఏటా ఏడు లక్షల కొత్త కేసులు నిర్ధారణ అవుతున్నాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇంత విశృంఖలంగా ప్రబలుతున్నా.. చాలామందికి లింఫోమా క్యాన్సర్ గురించి కానీ, వ్యాధి లక్షణాల గురించి కానీ అవగాహన ఉండటం లేదు. 'గ్లోబోకాన్' సంస్థ పరిశీలన ప్రకారం.. భారత్‌లో వేగంగా వ్యాపించే రక్త క్యాన్సర్‌లలో లింఫోమా ప్రధానమైంది. దేశంలో ఏటా తొంభైవేల వరకూ కొత్త కేసులు వెలుగులోకి వస్తున్నాయి. లింఫోమా అనేది రక్త సంబంధిత క్యాన్సర్లలో ఒకటి. తెల్ల రక్తకణాల్లో ఒక రకం కణాలైన లింఫోసైట్స్ ఉత్పత్తి చేసి, నిల్వ చేసి, ఆ తర్వాత వాటిని తరలించుకు వెళ్లే కణజాలాల్లో వచ్చే క్యాన్సర్ ఇది. దీనిలో ప్రాథమికంగా రెండు రకాలు ఉంటాయి. అవి... 1) హాడ్జికిన్స్ లింఫోమా 2) నాన్ హాడ్జకిన్స్ లింఫోమా.

లక్షణాలు

'మెడలో, చంకలో, గజ్జల్లో వాపు వస్తుంది. ఆ వాపు నొప్పి లేకుండానే వస్తుంటుంది. ప్లీహం (స్ప్లీన్) పెరుగుతుంది. పొట్టలో నొప్పితో పాటు అసౌకర్యంగా ఉంటుంది. జ్వరంతో చలిగా అనిపించడం లేదా రాత్రిళ్లు చెమటలు పట్టడం, విపరీతమైన నిస్సత్తువ కనిపిస్తుంది.

నిర్ధారణ పరీక్షలు :

'రక్త పరీక్షలు 'బయాప్సీ 'ఎముక మూలుగ పరీక్ష సెరిబ్రోస్పినల్ ఫ్లుయిడ్స్ (CSF)పరీక్ష 'మాలిక్యులార్ రోగ నిర్ధారణ పరీక్షలు ఎక్స్రే(XRAY), సీటీ స్కాన్, పెట్ స్కాన్ వంటి ఇమేజింగ్ పరీక్షలు చేయించాలి. వాటిని క్షుణ్ణంగా పరీక్షించి, లింఫోమా ఉందా, ఉంటే అది ఏ దశలో ఉందనే విషయాన్ని తెలుసుకోవచ్చు...

లింఫోమా అంటే ఏమిటి?

లుకేమియా మరియు లింఫోమా రెండూ రక్త క్యాన్సర్లు, ఇవి శరీరంలోని వివిధ భాగాలలో ఉద్భవించి వివిధ రకాల తెల్ల రక్త కణాలను ప్రభావితం చేస్తాయి. ఇది శోషరస వ్యవస్థకు వచ్చే క్యాన్సర్, ఇది శరీరంలోని రోగ నిరోధక శక్తిలో భాగం. లింఫోసైట్లు (B కణాలు లేదా T కణాలు) క్యాన్సర్ కణాలుగా మారి, లింఫ్ నోడ్స్ (శోషరస గ్రంథులు) మరియు ఇతర అవయవాలలో గడ్డలుగా ఏర్పడతాయి. లింఫోమా.. ఒక రకమైన రక్త క్యాన్సర్. నేరుగా శోషరస గ్రంథుల వ్యవస్థ మీద ప్రభావం చూపుతుంది. శరీరంలో శోషరస గ్రంథుల పాత్ర చాలా ప్రధానమైంది. వివిధ ఇన్‌ఫెక్షన్లకు, వ్యాధులకు వ్యతిరేకంగా పోరాడే బాధ్యత వీటిదే. శోషరస గ్రంథులు, శోషరస నాళం, ప్లీహం, అస్థిమజ్జ మొదలైన భాగాలకు .. శోషరస వ్యవస్థే రక్షణ కవచం. ఒక రకమైన కణాలైన లింఫోసైట్లు అసాధారణంగా పెరిగిపోవడం వల్ల ఆయా భాగాల్లో కణుతులు ఏర్పడి.. లింఫోమాకు దారితీస్తుంది. దురదృష్టవశాత్తు ఈ క్యాన్సర్ గురించి ప్రజల్లో అవగాహన తక్కువే. కానీ వ్యాధి తీవ్రత చాలా ఎక్కువ.

హాడ్కిన్ లింఫోమా (Hodgkin Lymphoma):

ఇది ఒక ప్రత్యేకమైన రకం, దీనిలో రీడ్‌స్టెర్న్‌బర్గ్ కణాలు ఉంటాయి.

లక్షణాలు

హాడ్కిన్ లింఫోమా యొక్క అత్యంత సాధారణ లక్షణం మెడ, చంకలు లేదా గజ్జలలో నొప్పిలేకుండా వాపు ఏర్పడిన శోషరస కణుపులు. ఇతర

సాధారణ లక్షణాలు:

B లక్షణాలు (B Symptoms): ఇవి లింఫోమాకు ప్రధాన హెచ్చరిక సంకేతాలు మరియు వీటిని కలిగి ఉంటాయి, వివరించలేని జ్వరం, రాత్రి చెమటలు (దుస్తులు మరియు పరుపులను తడిపేంత తీవ్రంగా చెమటలు పట్టడం), ప్రయత్నం లేకుండా బరువు తగ్గడం (శరీర బరువులో 10% లేదా అంతకంటే ఎక్కువ)

ఇతర కారకాలు :

- నిరంతర అలసట లేదా బలహీనత
- తీవ్రమైన దురద (ఎటువంటి దద్దుర్లు లేకుండా)
- దగ్గు లేదా శ్వాస ఆడకపోవడం (ఛాతీలోని శోషరస కణుపులు ఉబ్బినప్పుడు)
- ఆల్కహాల్ తాగినప్పుడు ప్రభావితమైన శోషరస గ్రంథులలో నొప్పి ..
- హాడ్కిన్ లింఫోమాకు ఖచ్చితమైన కారణం ఎల్లప్పుడూ స్పష్టంగా తెలియదు, కానీ కొన్ని ప్రమాద కారకాలు బట్టి కూడా గుర్తించవచ్చు:

వయస్సు

ఇది తరచుగా 20 నుండి 39 సంవత్సరాల మధ్య వయస్సు గల యువకులలో మరియు 65 ఏళ్లు పైబడిన వృద్ధులలో కనిపిస్తుంది.

లింగం: పురుషులలో హాడ్కిన్ లింఫోమా వచ్చే ప్రమాదం కొంచెం ఎక్కువగా ఉంటుంది.

వైరస్లు: ఎప్స్టీన్‌బార్ వైరస్ (EBV), ఇది గ్రంధుల జ్వరానికి కారణమవుతుంది, ఇది హాడ్కిన్ లింఫోమా ప్రమాదాన్ని పెంచుతుంది.

కుటుంబ చరిత్ర: తల్లిదండ్రులు లేదా తోబుట్టువులకు ఈ పరిస్థితి ఉన్నట్లయితే ప్రమాదం కొద్దిగా పెరుగుతుంది.

బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ: అవయవ మార్పిడి లేదా HIV/AIDS వంటి పరిస్థితుల కారణంగా బలహీనమైన రోగనిరోధక వ్యవస్థ కలిగిన వ్యక్తులకు ప్రమాదం ఎక్కువ.

నాన్-హాడ్కిన్ లింఫోమా (Non-Hodgkin Lymphoma):

- ఇది శోషరస వ్యవస్థలో (lymphatic system) మొదలయ్యే క్యాన్సర్.
- లింఫోసైట్‌లు అనే తెల్ల రక్త కణాల అసాధారణ పెరుగుదల వల్ల ఇది సంభవిస్తుంది.
- హాడ్కిన్ లింఫోమా కాకుండా, లింఫోమా యొక్క అన్ని ఇతర రకాలను ఇది సూచిస్తుంది, మరియు ఇందులో అనేక ఉప రకాలు ఉన్నాయి.

సాధారణ లక్షణాలు

- మెడ, చంక లేదా గజ్జల్లో నొప్పిలేని వాపు (శోషరస కణుపులు). కారణం లేకుండా జ్వరం. రాత్రి పూట విపరీతంగా చెమటలు పట్టడం. బరువు తగ్గడం (ప్రయత్నం లేకుండా) తీవ్రమైన అలసట.

రకాలు

- Bకణ లింఫోమాస్ మరియు Tకణ లింఫోమాస్.
- ఆశక్తి (Indolent): నెమ్మదిగా పెరుగుతుంది (ఉదా. ఫోలిక్యులర్ లింఫోమా).
- దూకుడు (Aggressive): వేగంగా పెరుగుతుంది (ఉదా. డిఫ్యూస్ లార్జ్ Bసెల్ లింఫోమా).

ప్రమాద కారకాలు

- వయస్సు (వృద్ధులలో ఎక్కువ).
- కొన్ని రకాల ఇన్ఫెక్షన్లు (HIV, హెపటైటిస్ C). రోగనిరోధక వ్యవస్థ బలహీనంగా ఉండటంవల్ల. కుటుంబంలో ఎవరికైనా రక్తానికి సంబంధించిన క్యాన్సర్ ఉంటే ఈ రుగ్మత రావచ్చు.

చికిత్స

రకం, దశ మరియు రోగి ఆరోగ్యంపై ఆధారపడి ఉంటుంది.

- కీమోథెరపీ (chemotherapy).
- రేడియేషన్ థెరపీ (radiotherapy).
- టార్గెటెడ్ థెరపీ (targeted therapy)
- ఇమ్యునోథెరపీ (immunotherapy).
- స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంట్ (stem cell transplant).

వ్యాధి రకాన్ని బట్టి, దశను బట్టి లింఫోమా లక్షణాలు వేర్వేరుగా ఉంటాయి. అయితే కొన్ని లక్షణాలు మాత్రం సర్వ సాధారణం. ఇది చాలా రకాల లింఫోమాలను కలిగి ఉంటుంది.

సాధారణ లక్షణాలు..

- మెడ, చంకలు, గజ్జల్లో శోషరస గ్రంథుల (లింఫ్ నోడ్స్) వాపు.
- అకారణంగా బరువు తగ్గడం.
- మగతగా, బలహీనంగా ఉండటం.
- జ్వరం, రాత్రిపూట ధారగా చెమటలు.
- దురద, దద్దుర్లు.
- పొత్తికడుపులో నొప్పి, వాపు.
- శ్వాసలో ఇబ్బంది, ఛాతీలో నొప్పి.
- దృష్టి దోషాలు, ఆకలి మందగించడం..

అయితే ఈ లక్షణాలు ఇతర సమస్యల వల్ల కూడా కనిపించవచ్చు. కొన్నిసార్లు ఏది లింఫోమా క్యాన్సర్, ఏది సాధారణ శ్వాసకోశ సమస్య అనే విషయంలో నిపుణులు ప్రాథమిక నిర్ధారణకు రాలేకపోవచ్చు. కాబట్టి ఈ లక్షణాల్లో ఏ ఒక్కటి వారాల తరబడి వెంటాడినా వెంటనే మీ వ్యక్తిగత వైద్యుని సంప్రదించాలి. తొలిదశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే లింఫోమా క్యాన్సర్‌ను జయించే అవకాశాలు మెరుగ్గా ఉంటాయి. చాలా సందర్భాల్లో ఈ లక్షణాలను ఫ్లూ లేదా వైరల్ ఇన్ఫెక్షన్‌గా పొరబడి తేలిగ్గా తీసుకునేవారూ ఉన్నారు. ఫలితంగా నిర్ధారణ, చికిత్స ఆలస్యమై పోతుంది. వ్యాధి మలిదశకు చేరుకుంటుంది... లింఫోమాను ప్రారంభ దశలో గుర్తించి, సరైన చికిత్స అందిస్తే కోలుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. చికిత్సలో కీమోథెరపీ, రేడియేషన్, మరియు ఇతర ఆధునిక పద్ధతులు ఉంటాయి.

ముఖ్య గమనిక:

లింఫోమా క్యాన్సర్ రోగిని ముప్పు తిప్పలు పెట్టే మొండి ఘటమే అయినా, రోగి ఆత్మస్థైర్యాన్ని కోల్పోవాల్సిన పన్లేదు. అత్యాధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో, కుటుంబసభ్యుల అండదండలతో, స్నేహితుల నైతిక మద్దతుతో ఈ క్యాన్సర్‌ను జయించడం అసాధ్యమేం కాదు. నిజానికి, ఆరోగ్యకరమైన జీవనశైలితో ఒక్క లింఫోమా అనేకాదు, అన్ని క్యాన్సర్లను సమర్థంగా ఎదుర్కోవచ్చు.

ఎలా గుర్తించాలి

2020లో భారతదేశంలో కొత్తగా నిర్ధారణ అయిన లింఫోమాస్ సంఖ్య, హాడ్జికిన్ లింఫోమాకు 11,230 మరియు నాన్-హాడ్జికిన్ లింఫోమా (NHL)కి 41,607. తక్కువ లేదా మధ్యస్థ హై డెవలప్‌మెంట్ ఇండెక్స్ (HDI) దేశాలలో వయస్సు-ప్రామాణిక సంఘటనలు మరియు మరణాల నిష్పత్తి 100,000 జనాభాకు పురుషులకు 4.0/2.5 మరియు మహిళలకు 2.8/1.7. లింఫోమా క్యాన్సర్‌ను ఎదుర్కొనే క్రమంలో.. నిపుణులైన వైద్యులు, అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్న ఆసుపత్రికి వెళ్లాలి. రోగి ఆరోగ్య పరిస్థితిని బేరీజు వేయడానికి సీటీ స్కాన్, పెట్ సీటీ స్కాన్, బయాప్సీ లాంటి ఇమేజింగ్ పరీక్షలు నిర్వహిస్తారు. అందులోనూ బయాప్సీ ద్వారా కచ్చితమైన నిర్ధారణ జరుగుతుంది. ముక్క పరీక్ష అనుమానిత కణితి నుంచి కణజాలం నమూనాను తీసుకుని, సూక్ష్మదర్శిని కింద పరీక్షించడం ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారు. క్యాన్సర్ రకం, దశ, రోగి వయసు, ఇతర రుగ్మతలు.. తదితర అంశాలపై లింఫోమా క్యాన్సర్ చికిత్స ఆధారపడి ఉంటుంది. కీమో థెరపీ, రేడియేషన్ థెరపీ, ఇమ్యునో థెరపీ, మూలకణాల మార్పిడి (స్టెమ్ సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్) లింఫోమా క్యాన్సర్ చికిత్సలో ముఖ్యమైన విధానాలు. ఆహారంలో పోషక విలువలకు సంబంధించి.. ఆహార నిపుణులు, చికిత్స తర్వాత నొప్పిని తట్టుకోవడానికి సరిపడా శారీరక, మానసిక బలాన్ని ఇవ్వడానికి నొప్పి నివారణకు, చికిత్స అవసరమవుతాయి. లింఫోమా చికిత్స వల్ల అరుదుగా వంధ్యత్వం లాంటి దుష్ఫలితాలు కనిపించినా.. త్వరగానే తగ్గిపోతుంది..



ఢిల్లీ బోణీ.. యూపీకి మూడో ఓటమి

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో వరుసగా రెండు పరాభవాల తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్ బోణీ కొట్టింది. బుధవారం ఇక్కడ ఆఖరి బంతి వరకూ ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో ఢిల్లీ.. యూపీ వారియర్స్‌ను 7 వికెట్ల తేడాతో ఓడించింది. గత మ్యాచ్‌ల మాదిరిగానే అన్ని విభాగాల్లో సమిష్టిగా విఫలమైన వారియర్స్ వరుసగా మూడో ఓటమిని మూటగట్టుకుంది. మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ.. సారథి మెగ్ లానింగ్ (38 బంతుల్లో 54, 9 ఫోర్లు, 1 సిక్స్), హర్లీన్ డియోల్ (36 బంతుల్లో 47, 7 ఫోర్లు) ఆదుకోవడంతో 20 ఓవర్లకు 154/8 రన్స్‌కు పరిమితమైంది. ఢిల్లీ బౌలర్లలో షెఫాలీ వర్మ, మరిజన్నె కాప్ తలా రెండు వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేశారు. ఇక ఛేదనలో విధ్వంసకర ఓపెనర్లు లిజెల్లె లీ (44 బంతుల్లో 67, 8 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఎప్పట్లాగే దూకుడుగా ఆడగా బంతితో రాణించిన షెఫాలీ బ్యాట్ (32 బంతుల్లో 36, 6 ఫోర్లు) రాణించారు. ఛేజింగ్‌లో ఓపెనర్లు షెఫాలీ వర్మ, లిజెల్లె లీ (షెఫాలీ) ధనాధన్ ఆటతో ఢిల్లీ విజయం నల్లేరుపై నడకలాగే సాగింది. ముఖ్యంగా లీ.. ఎప్పట్లాగే దొరికిన బంతిని దొరికినట్టుగా బౌండరీ లైన్ దాటించడంతో లక్ష్యం చిన్నదైపోయింది. ట్రియాన్ 6వ ఓవర్లో 4,4,6తో ఆమె రెచ్చిపోగా సోఫీ 8వ ఓవర్లో షెఫాలీ రెండు ఫోర్లు కొట్టింది. ట్రియాన్ 10వ ఓవర్లో 6తో 31 బంతుల్లో లీ ఈ టోర్నీలో వరుసగా రెండో అర్ధ శతకాన్ని నమోదుచేసింది. తొలి వికెట్‌కు 94 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని 12వ ఓవర్లో శోభన.. షెఫాలీని ఔట్ చేసి విడదీసింది. దీప్తి 14వ ఓవర్లో లీని వెనక్కి పంపగా వోల్వార్ట్, కెప్టెన్ జెమీమా (21) ఆ జట్టును గెలుపుదిశగా నడిపించారు. విజయానికి 6 పరుగుల దూరంలో జెమీమాను దీప్తి ఔట్ చేయడంతో మ్యాచ్‌లో ఉత్కంఠ మొదలైంది. సోఫీ ఆఖరి ఓవర్లో కాప్, వోల్వార్ట్ తలా ఓ బౌండరీతో ఢిల్లీ విజయాన్ని ఖాయం చేశారు.

డారిల్ మిచెల్ అద్భుత శతకం

- రెండో వన్డేలో న్యూజిలాండ్‌విజయం

రాజ్‌కోట్, జనవరి 14: డారిల్‌మిచెల్‌అద్భుత సెంచరీతో భారత్‌తో జరిగిన రెండో వన్డేలో న్యూజిలాండ్‌విజయం సాధించింది. మూడు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్ ఓటమి నుంచి తేరుకుంది. రాజ్‌కోట్ వేదికగా బుధవారం జరిగిన రెండో వన్డేలో సమష్టిగా రాణించిన న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించింది. క్రిస్టన్ క్లార్క్ బౌలింగ్‌లో సత్తా చాటగా.. డారిల్ మిచెల్ అద్భుతమైన శతకంతో చెలరేగాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లకు 284 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (92 బంతుల్లో 11 ఫోర్లు, సిక్స్‌తో 112 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగగా.. శుభ్‌మన్ గిల్ (53 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 56) హాఫ్ సెంచరీతో రాణించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో క్రిస్టియన్ క్లార్క్(3/56) మూడు వికెట్లు తీయగా.. కైల్ జెమీసన్, జాక్ ఫోక్స్, జైడన్ క్లార్క్, మైఖేల్ బ్రెస్‌వెల్ తలో వికెట్ తీసారు. అనంతరం న్యూజిలాండ్ 47.3 ఓవర్లలో 3 వికెట్లకు 286 పరుగులు చేసి గెలుపొందింది. డారిల్ మిచెల్(117 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్స్‌లతో 131 నాటౌట్) అజేయ శతకంతో రాణించగా.. గ్లేన్ ఫిలిప్స్(24 బంతుల్లో 2 ఫోర్లు, సిక్స్‌తో 32 నాటౌట్) అతనికి అండగా నిలిచాడు. భారత బౌలర్లలో హర్షిత్ రాణా, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు. భారీ లక్ష్య ఛేదనలో న్యూజిలాండ్‌కు శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు డెవాన్ కాన్వే(16), హెన్రి నికోల్స్(10) త్వరగానే ఔటయ్యారు. ఈ ఇద్దరూ ఆచితూచి ఆడగా.. కాన్వేను హర్షిత్ రాణా క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో న్యూజిలాండ్ పవర్ ప్లేలో వికెట్ నష్టానికి 34 పరుగులు చేసింది. హెన్రీ నికోల్స్(10)ను ప్రసిధ్ కృష్ణ క్లీన్ బౌల్డ్ చేయగా.. విల్ యంగ్, డారిల్ మిచెల్ ఆదుకున్నారు. ఆరంభంలో ఆచితూచి ఆడిన ఈ ఇద్దరూ ఆ తర్వాత దూకుడుగా ఆడారు. ఈ క్రమంలో డారిల్ మిచెల్ 52 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకోగా... విల్ యంగ్ 68 బంతుల్లో అర్ధ శతకం సాధించాడు. భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచిన ఈ జోడీ న్యూజిలాండ్ విజయానికి బాటలు వేసింది. సెంచరీ ముంగిట విల్ యంగ్(87)ను కుల్దీప్ యాదవ్ ఔట్ చేశాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 162 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వచ్చిన గ్లేన్ ఫిలిప్స్ సాయంతో డారిల్ మిచెల్ 96 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆఖరి వరకు క్రీజులో ఉండి విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

కోహ్లీ... నంబర్ వన్

టీమ్ఇండియా రన్ మిషీన్ విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రస్థానం దక్కించుకున్నాడు. నిరుడు రెండు ఫార్మాట్ల నుంచి తప్పుకుని వన్డేలు మాత్రమే ఆడుతున్న కోహ్లీ.. ఆస్ట్రేలియాతో పాటు స్వదేశంలో దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డే సిరీస్‌లోనూ అద్భుతంగా రాణించాడు. తాజాగా న్యూజిలాండ్‌తో వడోదరలో జరిగిన తొలి వన్డేలో 93 రన్స్ చేయడంతో అతడు.. మొదటి స్థానంలో ఉన్న రోహిత్ శర్మను అధిగమించి తన కెరీర్‌లో 11వ సారి ఈ ఘనతను అందుకున్నాడు. చివరిసారిగా వన్డే ర్యాంకింగ్స్‌లో కోహ్లీ 2021లో అగ్రస్థానం సాధించాడు. రోహిత్ తొలిస్థానాన్ని కోల్పోయి మూడో స్థానానికి దిగజారాడు.

హీలి.. క్రికెట్ కు గుడ్ బై

ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టు సారథి అలిస్సా హీలి అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. త్వరలో సొంతగడ్డపై భారత్‌తో జరుగబోయే మూడు ఫార్మాట్ల సిరీస్‌ల తర్వాత క్రికెట్ నుంచి వైదొలుగనున్నట్టు ఆమె తెలిపింది. 15 ఏండ్ల నుంచి ఆస్ట్రేలియాకు ప్రాతినిథ్యం వహిస్తున్న 35 ఏండ్ల హీలి.. ఆ జట్టు గెలిచిన 8 ప్రపంచ కప్‌లలో భాగస్వామిగా ఉంది. మూడు ఫార్మాట్లలో కలిసి సుమారు 300 మ్యాచ్‌లు ఆడి 7 వేలకు పైగా పరుగులు సాధించింది. 2023లో మెగ్ లానింగ్ నుంచి సారథ్య పగ్గాలు అందుకున్న ఆమె.. జట్టును విజయపథంలో నడిపించినా కీలక టోర్నీల్లో ఆసీస్ తడబాటుకు గురైంది.

'మన శంకర వర ప్రసాద్ గారు' సక్సెస్ పార్టీ

హాజరైన వెంకటేష్, రామ్ చరణ్, అనిల్ రావిపూడి, చిత్ర యూనిట్

మెగాస్టార్ చిరంజీవి మెగా ఎంటర్‌టైనర్ 'మన శంకర వరప్రసాద్ గారు' అద్భుత విజయాన్ని నమోదు చేసుకుంది. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ చిత్రం కేవలం రెండు రోజుల్లోనే రికార్డులను బద్దలు కొట్టి, సంచలనాత్మకంగా 100 కోట్ల క్లబ్‌లో చేరింది. ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా 120 కోట్లు వసూలు చేసింది. ఇండియాలో దృుతమైన జోరును కొనసాగిస్తూ, ఉత్తర అమెరికాలో 2 మిలియన్ డాలర్ల మైలురాయికి చేరువవుతున్న తరుణంలో మెగాస్టార్ ఇంట్లో వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ బ్లాక్‌బస్టర్ విజయాన్ని పురస్కరించుకుని, చిరంజీవి తన హైదరాబాద్ నివాసంలో ఒక గ్రాండ్ పార్టీని ఇచ్చి, ఆ సాయంత్రాన్ని సంక్రాంతి వేడుకల కొనసాగింపుగా మార్చారు. తారల సందడితో కూడిన వేడుకకు రామ్ చరణ్, వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెలతో పాటు పలువురు హాజరయ్యారు. ఈ వేడుకలు ఉత్సాహభరితమైన కేక్ కటింగ్ కార్యక్రమంతో ప్రారంభమయ్యాయి, అనంతరం చిత్ర బృందం అద్భుతమైన విందులో పాల్గొంది. నవ్వులు, కృతజ్ఞతలు, ఆత్మీయ సంభాషణలతో వేడుక కన్నుల పండగలా సాగింది. సినిమా ఘన విజయానికి కారణమైన ప్రతి సభ్యుడికి చిరంజీవి స్వయంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వేడుకను విజయోత్సవంగా మాత్రమే కాకుండా ముందస్తు భోగి, సంక్రాంతి సంబరాలుగా ఆనందంగా జరుపుకున్నారు. టీంలో కనిపించిన ఐక్యత, సినిమాకు లభిస్తున్న డ్రీమ్ రన్ కలిసి ఈ వేడుక మెగా మెమరబుల్ మూమెంట్ గా నిలిచింది.

'అనగనగా ఒక రాజు' బ్లాక్ బస్టర్

ఈ సంక్రాంతిని నవ్వుల పండుగలా మార్చడానికి 'అనగనగా ఒక రాజు' చిత్రంతో థియేటర్లలో అడుగుపెట్టారు స్టార్ ఎంటర్‌టైనర్ నవీన్ పొలిశెట్టి. మూడు వరుస ఘన విజయాలతో ప్రేక్షకుల హృదయాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న నవీన్ పొలిశెట్టి కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని.. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. నూతన దర్శకుడు మారి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మీనాక్షి చౌదరి కథానాయిక. మిక్కీ జె మేయర్ సంగీతం అందించారు.

భారీ అంచనాలతో సంక్రాంతి కానుకగా నేడు(జనవరి 14) ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'అనగనగా ఒక రాజు' చిత్రం.. మొదటి ఆట నుంచే అద్భుతమైన స్పందనను సొంతం చేసుకుంది. కడుపుబ్బా నవ్వించడమే కాకుండా, చివరిలో భావోద్వేగ సన్నివేశాలతో హృదయాలను హత్తుకొని.. అసలు సిసలైన పండగ సినిమాలా ఉందని 'అనగనగా ఒక రాజు' చూసిన ప్రతి ఒక్కరూ అభిప్రాయపడుతున్నారు. మొదటి షో నుంచే 'అనగనగా ఒక రాజు' సినిమాకి ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతుండటంతో.. తాజాగా సక్సెస్ ప్రెస్ మీట్ నిర్వహించిన చిత్ర బృందం, ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలపడంతో పాటు తమ సంతోషాన్ని పంచుకుంది.

కలిసి ముందుకు..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ స్థాపించిన 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్', ప్రముఖ నిర్మాణ సంస్థ 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీ'తో చేతులు కలిపిన విషయం విదితమే. ఈ రెండు సంస్థలు కలిసి గొప్ప చిత్రాలను ప్రేక్షకులను అందించడానికి సిద్ధమవుతున్నాయి. గతంలోనే ఈ సంస్థల మధ్య కథలకు సంబంధించిన చర్చలు జరిగాయి. తాజాగా మరోసారి పవన్ కళ్యాణ్, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ కలిసి రాబోయే ప్రాజెక్టులపై చర్చించారు. పవన్ కళ్యాణ్, టీజీ విశ్వప్రసాద్ భేటీ గురించి సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' స్పందిస్తూ.. 'భోగి శుభ సందర్భంగా కొత్త ఆరంభాల స్ఫూర్తిని సూచిస్తూ, రాబోయే ప్రాజెక్టులపై గతంలో జరిగిన చర్చలను కొనసాగిస్తూ, శ్రీ పవన్ కళ్యాణ్ గారు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ ని కలిసి మరింత విస్తృతంగా చర్చించారు.' అని తెలిపింది. 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్' ట్వీట్ కి నిర్మాత టీజీ విశ్వప్రసాద్ బదులిస్తూ.. 'కథలపై చర్చించడానికి మాకు అవకాశం కల్పించినందుకు పవన్ కళ్యాణ్ కి హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇది మాకు ఎంతో విలువైనది. ప్రేక్షకులకు బలమైన, అర్థవంతమైన, ప్రభావవంతమైన కంటెంట్‌ను అందించేందుకు 'పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్'తో కలిసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాము. ఈ కలయిక మాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది. ఈ అద్భుత ప్రయాణం కోసం ఎంతగానో ఎదురు చూస్తున్నాము." అని తమ సంతోషాన్ని పంచుకున్నారు.



అల్లు అర్జున్, లోకేష్ కనకరాజ్ మైత్రీ మూవీ మేకర్స్ భారీ ప్రాజెక్ట్

సంక్రాంతి రోజున ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అభిమానులకు మరో గుడ్‌న్యూస్ వచ్చేసింది. అల్లు అర్జున్ హీరోగా బ్లాక్ బస్టర్ ఫిల్మ్ మేకర్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో ఓ ప్రతిష్టాత్మక సినిమా రాబోతుంది. ఇండియన్ సినీ ఇండస్ట్రీలో ఇద్దరు స్టార్స్ కలిసి పని చేయబోతోన్న ఈ సినిమా ఆడియెన్స్‌కు ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించనుంది. ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌ను పవర్‌ఫుల్ వీడియో కంటెంట్ తో అనౌన్స్ చేయటంతో సినిమాపై అంచనాలు పెరిగాయి. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్, బివి వర్క్స్‌తో కలిసి నిర్మిస్తోన్న ఈ సినిమా నేషనల్ రేంజ్ లో అభిమానులు, ప్రేక్షకుల అంచనాలను పెంచేస్తోంది. ఈ భారీ చిత్రానికి నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మాతలు. బన్నీవాస్‌తో పాటు నట్టి, శాండీ, స్వాతి సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. సోషల్ మీడియాలో ఇప్పుడీ అనౌన్స్‌మెంట్ తెగ వైరల్ అవుతోంది. సినిమా ఎలా ఉండబోతుంది, కథేంటి అనే అంశాలపై పెద్ద ఎత్తున చర్చలు జరుగుతున్నాయి. తిరుగులేని స్టైల్, ఎలక్ట్రిఫైయింగ్ స్క్రీన్ ప్రెజెన్స్, పాన్ ఇండియా స్టార్‌డమ్ ఉన్న అల్లు అర్జున్.. వాస్తవానికి దగ్గరగా ఉండే, హై ఇంపాక్ట్ ఫిల్మ్ మేకింగ్‌తో కమర్షియల్ సినిమాలకు కొత్త అర్థం ఇచ్చిన దర్శకుడు లోకేష్ కనకరాజ్ కలిసి ఈ సినిమాలో పని చేస్తున్నారు. వీరికి తోడుగా రాక్‌స్టార్ అనిరుధ్ కూడా జాయిన్ కావటం విశేషం. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తోన్న ఈ సినిమా షూటింగ్ 2026 ఆగస్టులో ప్రారంభం కానుంది. AA23 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాలో అల్లు అర్జున్, లోకేష్ కనగరాజ్ డైనమిక్ దర్శకత్వంలో ఇప్పటివరకు ఎప్పుడూ చూడని కొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. రీసెంట్ టైమ్స్‌లో అందరూ అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ఒకటిగా మారింది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200